




# వార్తాప్రభ

RNI No. APTEL/2004/12176

epaper : https://varthaprabha.com

సమగ్ర వార్తా దినపత్రిక

విజయవాడ, హైదరాబాద్ నుండి ప్రచురణ








| విజయవాడ | సంపుటి : 25 | సంచిక : 41 | ది. 13-5-2026 | బుధవారం | పేజీలు : 8 | వెల : రూ.1/- |
|---|---|---|---|---|---|---|
| VIJAYAWADA | Vol.No : 25 | Issue No : 41 | Date : 13-5-2026 | Wednesday | Pages : 8 | Rs.1/- |


## ప్రధాని మోదీ ఇంధన పొదుపు పిలుపు

### అసాధారణం కాదు, ప్రపంచ అవసరం



**న్యూ ఢిల్లీ(పి.ఐ.బి.),మే 12 (వార్తాప్రభ) :** ఈ ప్రపంచ సంక్షోభ సమయంలో, చాలా దేశాల ప్రభుత్వాలు ప్రజలను ఖర్చులు తగ్గించమని, ప్రయాణాలు తగ్గించమని, ఇంధనాన్ని ఆదా చేయమని తరచూ కోరుతున్నాయి. ప్రధాని మోదీ చేసిన నియంత్రణ పాటించాలనే పిలుపు కూడా ఇదే ప్రపంచవ్యాప్త ధోరణిలో భాగం. చాలా దేశాలు కేవలం విజ్ఞప్తులతో ఆగిపోలేదు. 2026 చమురు సంక్షోభాన్ని ఎదుర్కొనేందుకు ఇంధన రేషన్ విధానం, తప్పనిసరి వర్క్ ఫ్రం హోమ్, ఇంధన వినియోగ పరిమితులు, వేగ పరిమితులు తగ్గించడం, ప్రయాణాలపై ఆంక్షలు లాంటి నిబంధనలు అమలు చేస్తున్నాయి.

**ప్రపంచవ్యాప్తంగా కనిపిస్తున్న పరిస్థితి..** ప్రపంచ ఇంధన సంక్షోభాలకు ప్రతిస్పందనగా, సుమారు 40 దేశాలు తీసుకున్న అత్యవసర ఇంధన పొదుపు చర్యలను ఐ.ఈ.ఏ. ట్రాకర్ నమోదు చేసింది. యూరోపియన్ కమిషన్ కూడా ఇందులో భాగమైంది. 40కి పైగా దేశాలు ఇంధన వినియోగం, రవాణా నియంత్రణపై చర్యలు చేపట్టాయి. అభివృద్ధి చెందిన దేశాలు ఎక్సైజ్ సుంకాల్లో కోతలు, ప్రభుత్వ ఆర్థిక సహాయ విధానాలు, అధిక ధరల వసూళ్లపై హెచ్చరికలు, రవాణా, వ్యవసాయం, ఎక్కువగా ప్రయాణించే వర్గాలకు ప్రత్యేక ఉపశమన చర్యలు తీసుకొచ్చాయి. 3 దేశాలు వంటనూనె, ఎల్పిజి వినియోగం తగ్గించేందుకు నేరుగా చర్యలు అమలు చేశాయి. అందులో రేషన్ విధానం, సిలిండర్లను సగం మాత్రమే నింపడం, విద్యుత్ లేదా పిఎన్జి ప్రత్యామ్నాయాలకు మార్పు వంటి నిర్ణయాలు ఉన్నాయి. 18 దేశాలు రవాణా వినియోగం తగ్గించే వ్యూహాలను అమలు చేశాయి. అందులో ఇంధన రేషన్ లేదా పరిమితులు, వాహనాలను ప్రత్యామ్నాయ రోజులలో నడపడం, పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్, కార్‌పూలింగ్ ప్రోత్సాహం, వ్యక్తిగత లేదా ప్రభుత్వ వాహనాలపై పరిమితులు, ఇవి లకు ప్రోత్సాహకాలు ఉన్నాయి. 13 దేశాలు ముఖ్యంగా ప్రభుత్వ రంగంలో వర్క్ ఫ్రం హోమ్, రిమోట్ వర్క్ విధానాలను ప్రోత్సహించాయి. దాదాపు అన్ని దేశాలు --- అంటే 35కి పైగా దేశాలు --- ప్రజా ప్రచారాలు, కూలింగ్-లైటింగ్ వినియోగ పరిమితులు, ప్రభుత్వ ప్రయాణాల నియంత్రణ, సాధారణ ఇంధన సామర్థ్య కార్యక్రమాల ద్వారా ఇంధన వినియోగం తగ్గించే విస్తృత చర్యలు ప్రారంభించాయి.

## జైలు అంటే శిక్ష మాత్రమే కాదు.. సంస్కరణకు కేంద్రంగా మారాలి

● జైలు అనుభవం కార్యక్రమం, ● జైలు మ్యూజియం ప్రారంభోత్సవంలో గవర్నర్ శ్రీ శివ ప్రతాప్ శుక్లా



**హైదరాబాద్,మే 12 (వార్తాప్రభ) :** సమాజ అభ్యున్నతికి శిక్షతో పాటు సంస్కరణ కూడా సమానంగా అవసరమని, జైళ్లు కేవలం శిక్ష విధించే ప్రదేశాలుగా కాకుండా ఆత్మపరిశీలన, వ్యక్తిత్వ వికాసం, కొత్త జీవితానికి నాంది పలికే కేంద్రాలుగా మారాలని రాష్ట్ర గవర్నర్ శ్రీ శివప్రతాప్ శుక్లా పేర్కొన్నారు. మంగళవారం హైదరాబాద్‌లోని చంచల్‌గూడలో రాష్ట్ర కారాగార శిక్షణ సంస్థ లో ఫీల్ ది జైల్ ( జైలు అనుభవం)' కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఫీల్ ది జైల్ సెల్ లను పరిశీలించారు. అనంతరం జైలు మ్యూజియంను ప్రారంభించి నిజాం పాలన కాలంలోని జైలు లు , నాగార్జున సాగర్ డ్యాం నిర్మాణంలో ఖైదీల పాత్ర, దాశరథి , రామదాసు లను బంధించిన జైలు నమూనాలు, ఖైదీల్లో మార్పు కోసం తీసుకున్న చర్యలు, జైలు ఉత్పత్తులు, జైలు కార్యకలాపాలు, అచీవ్ మెంట్ లను గవర్నర్ పరిశీలించారు. అనంతరం గవర్నర్ విక్రయానికి ఉంచిన జైలు ఉత్పత్తులను పరిశీలించారు. అనంతరం వాల్మీకి పేరుతో ఖైదీల్లో సత్ప్రవర్తనకు తీసుకుంటున్న చర్యల వివరించే డాక్యుమెంటరీ నీ గవర్నర్ తిలకించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడుతూ, 'జైలు మ్యూజియం' ప్రారంభం కేవలం ఒక భవనం ప్రారంభోత్సవం కాదని, న్యాయం--సంస్కరణల దిశగా ముందుకు తీసుకెళ్తున్న ఒక కీలక అడుగని అన్నారు. ఈ మ్యూజియంలో ప్రదర్శించిన పాత సంకెళ్లు, జైలు గదులు గతంలోని కఠిన కారాగార వ్యవస్థను గుర్తుచేస్తే, ఖైదీల నైపుణ్యాభివృద్ధి, కారాగార పరిశ్రమల ద్వారా రూపొందిన ఉత్పత్తులు వంటి కార్యక్రమాలు 'ప్రతీకారం నుంచి పరివర్తన' వైపు తీసుకెళ్తున్న మార్పుకు నిదర్శనంగా నిలిచాయని గవర్నర్ పేర్కొన్నారు. ప్రగతిశీల సమాజం అంటే తప్పు చేసిన వారిలో మార్పు తీసుకురావడానికి ఎంత సున్నితంగా, బాధ్యతాయుతంగా వ్యవహరిస్తుందన్న దానిపైనే ఆధారపడి ఉంటుందని గవర్నర్ అన్నారు. ఖైదీల పునరావాసం సమాజం యొక్క నైతిక బాధ్యత అని స్పష్టం చేశారు. తాను గతంలో ఉత్తర ప్రదేశ్ రాష్ట్ర ప్రిజన్ మంత్రిగా పనిచేసిన విషయాన్ని ఈ సందర్భంగా గవర్నర్ గుర్తు చేశారు. తెలంగాణ కారాగార శాఖ శిక్షతో పాటు పునర్నిర్మాణానికి ప్రాధాన్యతనిస్తూ ముందుకు సాగడం అభినందనీయమన్నారు. 'ఫీల్ ది జైల్' కార్యక్రమాన్ని వినూత్న విద్యా కార్యక్రమంగా అభివర్ణించిన గవర్నర్, ముఖ్యంగా యువతలో చట్టాల పట్ల గౌరవం, క్రమశిక్షణ, పౌర బాధ్యతను పెంపొందించడంలో ఇది కీలక పాత్ర పోషిస్తుందని చెప్పారు. స్వేచ్ఛ ఎంత అమూల్యమైనదో, చట్టాన్ని పాటించడం సమాజానికి ఎలా మేలు చేస్తుందో ఈ కార్యక్రమం ప్రజలకు గుర్తుచేస్తుందన్నారు. ఈ వినూత్న ఆలోచనను కార్యరూపం దాల్చించిన తెలంగాణ రాష్ట్ర ప్రిజన్స్, కరెక్షనల్ సర్వీసెస్ శాఖ డైరెక్టర్ జనరల్ డాక్టర్ సౌమ్య మిశ్రా , అధికారులను గవర్నర్ ఈ వేదికగా అభినందించారు. ఈ జైల్ మ్యూజియం భవిష్యత్తులో పర్యాటక ఆకర్షణగా మాత్రమే కాకుండా విద్య, పరిశోధన, సామాజిక చైతన్యానికి ఒక శక్తివంతమైన వేదికగా నిలుస్తుందనే ఆశాభావం వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రిజన్స్, కరెక్షనల్ సర్వీసెస్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ సౌమ్య మిశ్రా మాట్లాడుతూ... రాష్ట్ర ప్రిజన్స్, కరెక్షనల్ సర్వీసెస్ శాఖ లో ఈ కార్యక్రమాలను ప్రారంభించుకోవడం కొత్త అధ్యాయం అని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రిజన్స్ ఐ జి ఎన్ మురళి బాబు, డి ఐ జి లు డా డి శ్రీనివాస్, ఏం సంపత్ తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ కీలక నేతలతో కేసీఆర్ భేటీ

● ఎర్రవెల్లి ఫాంహౌస్ లో కీలక సమావేశం నిర్వహించిన కేసీఆర్



**హైదరాబాద్,మే 12 (వార్తాప్రభ) :** బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అధ్యక్షతన ఎర్రవెల్లి ఫాంహౌస్ లో కీలక సమావేశం జరిగింది. పార్టీ సంస్థాగత మార్పులు, భవిష్యత్తు కార్యాచరణపై ఈ భేటీలో స్పష్టమైన దిశానిర్దేశం చేసినట్లు తెలుస్తోంది. రాష్ట్రంలో మారుతున్న రాజకీయ పరిణామాల నేపథ్యంలో, పార్టీని గ్రామ స్థాయి నుంచి బలోపేతం చేయడంపై కేసీఆర్ ప్రత్యేక దృష్టి సారించారు. ఇందులో భాగంగా సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని వేగవంతం చేయడం... జిల్లా, నియోజకవర్గాల వారీగా పార్టీ ఇన్‌ఛార్జుల నియామకం, అలాగే అంతర్గత కమిటీల ఏర్పాటుపై ఈ సమావేశంలో సుదీర్ఘంగా చర్చించారు. పార్టీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపడానికి ఈ సంస్థాగత మార్పులు దోహదపడతాయని నాయకత్వం భావిస్తోంది. ఈ సమావేశంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తో పాటు, పార్టీ ప్రధాన కార్యదర్శులు, శాసనసభ, మండలి పక్షాల ప్రముఖ నేతలు పాల్గొన్నారు. హరీశ్ రావు, సబితా ఇంద్రారెడ్డి, తలసాని శ్రీనివాస్ యాదవ్, మధుసూదనాచారి, ఎల్. రమణ, పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి, పార్టీ ప్రధాన కార్యదర్శులు తక్కెళ్లపల్లి రవీందర్ రావు, పల్లా రాజేశ్వర్ రెడ్డి, బండ ప్రకాశ్ ముదిరాజ్, వి. గంగాధర్ గౌడ్, జోగినపల్లి సంతోశ్ కుమార్, నారదాసు లక్ష్మణరావు, ఆర్. శ్రవణ్ కుమార్ రెడ్డి, ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, టి. జీవన్ రెడ్డి, సోమా భరత్ కుమార్ గుప్తా, సత్యవతి రాథోడ్, రావుల చంద్రశేఖర్ రెడ్డి తదితరులు సమావేశానికి హాజరయ్యారు. ప్రత్యేక ఆహ్వానితులుగా సురేశ్ రెడ్డి, మహమూద్ అలీ, మారెడ్డి శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

## హైవే మ్యాన్ ఆఫ్ ఇండియా'ను కలవడం సంతోషంగా ఉంది: నారా లోకేష్

- గౌహతిలో కేంద్ర మంత్రి గడ్కరీతో చంద్రబాబు, లోకేష్ భేటీ
- అసోం సీఎం ప్రమాణ స్వీకారోత్సవానికి హాజరైన నేతలు
- గడ్కరీని 'హైవే మ్యాన్ ఆఫ్ ఇండియా'గా అభివర్ణించిన లోకేష్
- ఏపీలో జరుగుతున్న పనులను గడ్కరీ ప్రశంసించారని వెల్లడి



**గౌహతి,మే 12 (వార్తాప్రభ) :** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ గౌహతిలో కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీతో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. అసోం ముఖ్యమంత్రిగా హిమంత బిశ్వ శర్మ ప్రమాణ స్వీకారోత్సవంలో పాల్గొనేందుకు వెళ్లిన వీరు, గౌహతి విమానాశ్రయంలో గడ్కరీని కలిశారు. ఈ సమావేశం అనంతరం మంత్రి నారా లోకేష్ సోషల్ మీడియా వేదికగా తన స్పందనను పంచుకున్నారు. కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని 'హైవే మ్యాన్ ఆఫ్ ఇండియా' అని అభివర్ణించిన లోకేష్, ఆయనను కలవడం సంతోషంగా ఉందని పేర్కొన్నారు. జాతి నిర్మాణం, మౌలిక సదుపాయాల కల్పనలో గడ్కరీ చూపిస్తున్న ఉత్సాహం తమందరికీ స్ఫూర్తిదాయకమని అన్నారు. దేశాన్ని వేగంగా, బలంగా నిర్మించాలన్న ఆయన తపన అమోఘమని కొనియాడారు. ఈ సందర్భంగా, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను గడ్కరీ ప్రశంసించారని లోకేష్ వెల్లడించారు. ఏపీలో ప్రపంచ స్థాయి మౌలిక వసతులు నిర్మించేందుకు తాము చేస్తున్న కృషికి ఆయన ప్రోత్సాహం ఎంతో విలువైనదని లోకేష్ తన పోస్టులో పేర్కొన్నారు. ఈ భేటీలో చంద్రబాబు, గడ్కరీ పలు అంశాలపై చర్చించుకున్నట్లు తెలుస్తోంది. ఈ భేటీలో కేంద్ర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు కూడా పాల్గొన్నారు.

## అగ్నిప్రమాదాల నివారణపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

● సిబ్బంది కొరత ఉన్నచోట దశల వారిగీ ఖాళీలు భర్తీ చేయండి హోంమంత్రి వంగలపూడి అనిత




**అమరావతి,మే 12 (వార్తాప్రభ) :** రాష్ట్ర అగ్నిమాపక శాఖ పనితీరుపై హోంమంత్రి వంగలపూడి అనిత సమగ్ర సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలో ఫైర్ స్టేషన్లు లేని 22 నియోజకవర్గాల పరిస్థితిపై అధికారులతో చర్చించిన మంత్రి, కొత్తగా ప్రతిపాదించిన 5 ఫైర్ స్టేషన్ల ఏర్పాటు ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. ప్రత్యేకంగా విశాఖపట్నం పశ్చిమ నియోజకవర్గంలోని పారిశ్రామిక ప్రాంతాల్లో పరిశ్రమల భాగస్వామ్యంతో ఫైర్ స్టేషన్లు ఏర్పాటు చేసే అవకాశాలను పరిశీలించాలని సూచించారు. అగ్నిమాపక శాఖలో ఉన్న సిబ్బంది కొరతను దృష్టిలో ఉంచుకుని అవసరమైన 1,275 పోస్టులను దశలవారీగా భర్తీ చేయాలని, ఇప్పటికే జాబ్ క్యాలెండర్‌లో ఉన్న 305 పోస్టుల నియామక ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. అగ్నిమాపక సిబ్బంది స్పందన సమయాన్ని ప్రస్తుతం ఉన్న 25--30 నిమిషాల నుంచి 15 నిమిషాలకు తగ్గించేలా ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని మంత్రి స్పష్టం చేశారు. పరిశ్రమల సహకారంతో ఫైర్ అవుట్‌పోస్టులు ఏర్పాటు చేయడం, ఫైర్ టెండర్ల వినియోగంపై ఆడిట్ నిర్వహించడం, సెజ్ ప్రాంతాల్లో సమిష్టి ఫైర్ స్టేషన్ల ఏర్పాటు అంశాలను పరిశీలించాలని సూచించారు. పరిశ్రమల్లో ఫైర్ సేఫ్టీ అధికారుల నియామకం తప్పనిసరి చేయడంతో పాటు, వారి పనితీరుపై ర్యాండమ్ తనిఖీలు నిర్వహించాలని తెలిపారు. లైసెన్స్ పొడిగింపులకు ఫైర్ సేఫ్టీ సర్టిఫికెట్లు తప్పనిసరి చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అడవి అగ్నిప్రమాదాల నియంత్రణలో భాగంగా డ్రోన్ల వినియోగం, హాజర్డ్ సైన్ బోర్డుల ఏర్పాటు, వ్యర్థాల సరైన వర్గీకరణ లేకపోవడం వల్ల సంభవించే అగ్నిప్రమాదాల నివారణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని మంత్రి సూచించారు. పాఠశాలలు, ఆసుపత్రులు, అపార్ట్‌మెంట్లలో ఫైర్ సేఫ్టీ అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం, "ఆపద మిత్ర" తరహాలో యువత, విద్యార్థులకు స్వచ్ఛంద సేవా శిక్షణ విస్తరించాలని తెలిపారు. అలాగే సింగపూర్, స్విట్జర్లాండ్తో పాటు ఛత్తీస్‌గఢ్, చండీగఢ్ రాష్ట్రాల విపత్తు నిర్వహణ విధానాలను అధ్యయనం చేసి, రాష్ట్రంలో అమలు చేయగల అంశాలపై నివేదిక సమర్పించాలని అధికారులను ఆదేశించారు.

## బీసీ విద్యా సంస్థల్లో విప్లవాత్మక మార్పులు

● రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత ● కూటమి ప్రభుత్వం ప్రోత్సాహంతో టెన్త్, ఇంటర్ లో అత్యుత్తమ ఫలితాలు ● ఫలితాల్లో బీసీ వెల్ఫేర్ నెంబర్ వన్ ● బీసీ బిడ్డల ప్రతిభ రాష్ట్రానికి గర్వకారణం ● 2027 నాటికి మరింత మెరుగైన ఫలితాలే లక్ష్యం : మంత్రి సవిత



**విజయవాడ,మే 12 (వార్తాప్రభ) :** రాష్ట్రంలో బీసీ సంక్షేమ విద్యాసంస్థలు నాణ్యమైన విద్య, ఆధునిక సౌకర్యాలతో ఆదర్శంగా నిలుస్తున్నాయని బీసీ సంక్షేమం, ఈడబ్ల్యూఎస్ సంక్షేమం, చేనేత ఒ జౌళి శాఖ మంత్రి ఎస్. సవిత తెలిపారు. ఇటీవల విడుదలైన పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షల్లో రాష్ట్ర స్థాయిలో అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులు బీసీ వర్గాలకు మాత్రమే కాకుండా సమాజానికే ఆదర్శం నిలిచారని కొనియాడారు. రాష్ట్ర వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం విజయవాడలోని తుమ్మలపల్లి వారి క్షేత్రయ్య కళాక్షేత్రంలో 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించిన పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన ఎంజేపీ గురుకులాలు, బీసీ వసతి గృహాల విద్యార్థులకు అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న మంత్రి ఎస్. సవిత మాట్లాడుతూ విద్యార్థుల విజయాల్లో ఉపాధ్యాయులు, వార్డెన్లు, అధికారులు, సిబ్బంది, తల్లిదండ్రుల పాత్ర ఎంతో కీలకమని అన్నారు. బీసీ సంక్షేమ శాఖను రాష్ట్రంలో ఆదర్శ శాఖగా తీర్చిదిద్దడంలో శాఖ కార్యదర్శి సత్యనారాయణ, డైరెక్టర్ మల్లికార్జున్, ఎంజేపీ సొసైటీ కార్యదర్శి మాధవీలతతో పాటు అన్ని స్థాయిల అధికారులు, సిబ్బంది సమిష్టిగా కృషి చేస్తున్నారని కొనియాడారు. తాను కూడా ప్రభుత్వ పాఠశాలల్లోనే చదువుకుని ఈ స్థాయికి చేరుకున్నానని, ప్రభుత్వ విద్యాసంస్థల్లో నాణ్యమైన ఉపాధ్యాయులు, ఆహారం, వసతులు అందుబాటులో ఉండటంతో బీసీ వెల్ఫేర్ విద్యాసంస్థలు అద్భుతమైన ఫలితాలు సాధిస్తున్నాయని పేర్కొన్నారు.

# పోటెత్తిన భక్తులు

● భారీ అన్న ప్రసాద వితరణ





**విస్సన్నపేట,మే 12 (వార్తాప్రభ) :** స్థానిక మండల కేంద్రంలో శ్రీ దాసాంజనేయ స్వామి వారి ఆలయంలో హనుమాన్ జయంతి సందర్భంగా భారీ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. తొలిత విఘ్నేశ్వర పూజ శ్రీ బజరంగ బలి స్వామి కి ప్రత్యేక పూజలతో పాటు హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహించారు. సుహాసినిలసే స్వామి వార్లకు శ్రీ సీతారామ లక్ష్మణ భరత శతృఘ్న ఆంజనేయ స్వామి వార్లకు మామిడి తాంబూలాలు అందించారు. అంతరం అన్నప్రసాద వితరణ నిర్వహించారు. శ్రీ షిరిడి సాయి సేవ మందిరం 22వ వార్షికోత్సవ ఉత్సవ మహోత్సవ కార్యక్రమంలో భాగంగా శ్రీ సాయిబాబాకు లక్ష మల్లెల పూజలు జరిపారు. హనుమాన్ జయంతి సందర్భంగా లక్ష తమలపాకుల ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమానంతరం భక్తులకు అన్న ప్రసాదం అందించారు. బాబా హారతి అనంతరం మల్లెపూలు తమలపాకుల తాంబూలాలు అందించారు.

## హనుమాన్ జయంతి



**తిరువూరు,మే 12 (వార్తాప్రభ) :** తిరువూరు చీరాల సెంటర్ లోని శ్రీ వీరాంజనేయ ఆలయంలో.. స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన ...తిరువూరు కోర్టు జడ్జి కే సూర్య తేజఈ సందర్భంగా సూర్య తేజ నీ ఆలయ కమిటీ వారు నూతన వస్త్రాలు , స్వామి వారి ఫోటో ను అందచేసి మర్యాదపూర్వకంగా సత్కరించారు. నాగుబండి ప్రకాశరావు, శ్యాం,విశ్వేశ్వర రావు(బుజ్జి), వాసవి క్లబ్ యువసేన అధ్యక్షులు అత్యంహరికృష్ణ,న్యాయవాది బొడ్డు అవినాష్ పాల్గొన్నారు.

## ఘనంగా చి॥ నిమ్మరాజు జోష్విక జన్మదిన వేడుక



**హైదరాబాద్,మే 12 (వార్తాప్రభ) :** సీనియర్ జర్నలిస్ట్ నిమ్మరాజు చలపతిరావు - శ్రీమతి రజని దంపతుల మనుమరాలు,శ్రీవత్సవ కుమార్ - శ్రీమతి నాగజ్యోతి దంపతుల కుమార్తె చి. జోష్విక జన్మదిన వేడుక హైదరాబాద్ నిజాంపేట్ స్ప్రింగ్ బోర్డ్ పాఠశాలలో చిరంజీవి అభ్యసించే తోటి పిల్లల మధ్య ఘనంగా జరిగింది.

## హనుమాన్ జయంతి సందర్భంగా 500 లీటర్ల మజ్జిగ పంపిణీ



**హనుమాన్ జంక్షన్,మే 12 (వార్తాప్రభ) :** హనుమాన్ జయంతి సందర్భంగా హనుమాన్ జంక్షన్ లో సత్యనారాయణ స్వీట్స్ & హోం ఫుడ్స్ అధినేత డాక్టర్ యనమదల రమేష్ వారి మిత్ర బృందం ఆధ్వర్యంలో భక్తులకు 500 లీటర్ల మజ్జిగ మరియు చల్లని తాగునీరు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ యనమదల రమేష్ మాట్లాడుతూ గత 20 రోజులుగా చలివేంద్రం ఏర్పాటు చేసి పాదచారులకు చల్లని మంచినీరు అందిస్తున్నామని వేసవి తీవ్రత దృష్ట్యా చలివేంద్రాన్ని కొనసాగిస్తామని ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రాపర్ల శ్యామ్, కంటిపూడి పుల్లయ్య చౌదరి, కటకం నాగేశ్వరరావు, అక్కపోలు శ్రీను , గారపాటి శ్రీధర్, దమ్మాలపాటి హరిబాబు, గంధం నారాయణరావు , యనమదల వేణుగోపాల్ దోనవల్లి రవి, శివ తదితరులు పాల్గొన్నారు.

# మానవ సేవకు ప్రతిరూపాలు నర్సులు - వారి త్యాగం వెలకట్టలేనిది

● అంతర్జాతీయ నర్సుల దినోత్సవ సందర్భంగా నర్సులకు రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ శుభాకాంక్షలు



**రామచంద్రపురం,మే 12 (వార్తాప్రభ) :** అంతర్జాతీయ నర్సుల దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ నర్సింగ్ సిబ్బందికి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ప్రపంచ ఆరోగ్య వ్యవస్థలో నర్సులు అందిస్తున్న సేవలు అమూల్యమని, రోగి ప్రాణాలను కాపాడే మహోన్నత బాధ్యతను వారు అంకితభావంతో నిర్వహిస్తున్నారని కొనియాడారు. రోగి బాధను తమ బాధగా భావించి సేవలందించే నర్సులు నిజమైన మానవతా మూర్తులని మంత్రి పేర్కొన్నారు. ఆసుపత్రిలో వైద్య సేవలకు జీవం పోసేది నర్సులేనని, వైద్యులు చికిత్స అందిస్తే రోగికి ధైర్యం, ఆదరణ, ఆత్మస్థైర్యం ఇచ్చేది నర్సులేనని అన్నారు. ప్రసూతి సేవలు, అత్యవసర చికిత్సలు, గ్రామీణ ఆరోగ్య సంరక్షణ, వృద్ధుల సేవలు, మహమ్మారుల సమయంలో నర్సులు చేసిన సేవలు చిరస్మరణీయమని మంత్రి సుభాష్ తెలిపారు. కరోనా వంటి క్లిష్ట పరిస్థితుల్లో తమ ప్రాణాలను సైతం పణంగా పెట్టి ప్రజల ఆరోగ్య రక్షణ కోసం పనిచేసిన నర్సుల సేవలను సమాజం ఎప్పటికీ మరువదన్నారు. ఫ్లోరెన్స్ నైటింగేల్ ఆశయాలను కొనసాగిస్తూ నేటి నర్సులు సేవా తత్వానికి ప్రతీకలుగా నిలుస్తున్నారని మంత్రి పేర్కొన్నారు. "నర్సింగ్ అనేది కేవలం వృత్తి కాదు.. అది కరుణ, సహనం, సేవాభావం కలిసిన పవిత్రమైన బాధ్యత" అని అన్నారు. రాష్ట్ర ప్రజా ఆరోగ్య పరిరక్షణలో కీలక పాత్ర పోషిస్తున్న ప్రతి నర్సుకు ప్రభుత్వం, సమాజం ఎల్లప్పుడూ రుణపడి ఉంటుందని తెలిపారు. ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందిస్తూ ఆరోగ్య రంగ అభివృద్ధిలో నర్సులు ముందుండాలని ఆకాంక్షిస్తూ అంతర్జాతీయ నర్సుల దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు.

# వైభవోపేతంగా హనుమజ్జయంతి వేడుకలు...



**గుడ్లవల్లేరు,మే 12 (వార్తాప్రభ) :** మండలంలోని మామిడికోళ్లలోని శ్రీ ఆంజనేయ స్వామివారి దేవస్థానంలో హనుమజ్జయంతి వేడుకలను వైఎస్సార్ సీపీ రాష్ట్ర లీగల్ సెల్ మాజీ కన్వీనర్, సుప్రీం కోర్టు సీనియర్ న్యాయవాది చిత్తర్వు నాగేశ్వరరావు, రాజ్యలక్ష్మి దంపతుల ఆధ్వర్యంలో మంగళవారం వైభవోపేతంగా నిర్వహించారు. స్వామివారికి క్వాలిటీ ఫీడ్స్ అధినేత కోగంటి ఆంజనేయులు ప్రత్యేక పూజలను చేపట్టారు. వందలాది మంది అన్నసమారాధన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమాన్ని చిత్తర్వు చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వస్త్రదానం చేపట్టారు. కార్యక్రమంలో డాక్టర్ చిత్తర్వు మధు, హైకోర్టు ప్రముఖ న్యాయవాది చిత్తర్వు రఘు, మాజీ సర్పంచి కొత్తూరి లక్ష్మీనారాయణ, కొండలమ్మ ఆలయ తొలి ఛైర్మన్ తాళ్లూరి మాధవ్, వైఎస్సార్ సీపీ నేతలు మిరియాల రాజేంద్రప్రసాద్(ఎంఆర్పీ), చావా నాగేశ్వరరావు, బద్రినాథ్, కమల, కిశోర్ తదితరులు పాల్గొన్నారు. అలాగే అంగలూరులోని ప్రధాన సెంటర్‌లోని ఆంజనేయ స్వామివారి ఆలయం వద్ద కమిటీ వారు అఖండ అన్నసమారాధన కార్యక్రమాన్ని వేలాది మందికి నిర్వహించారు. గుడ్లవల్లేరు తహసీల్దార్ కార్యాలయ సమీపంలోని ఆంజనేయ స్వామి, బస్టాండ్ సెంటర్ ఆంజనేయ స్వామి, సత్యనారాయణ స్వామివారి ఆలయంలో హనుమంతునకు ప్రత్యేక పూజలను నిర్వహించారు. జిల్లా లయన్స్ మాజీ గవర్నర్ వైపీసీ ప్రసాద్ దంపతుల సేవలను కొనియాడుతూ ఈ సందర్భంగా ఘన సన్మానం చేశారు. మండలంలోని డోకిపర్రు మహాక్షేత్రంలో హనుమజ్జయంతిని పురస్కరించుకుని ఆంజనేయ స్వామివారికి విశేషాభిషేకాలతో పాటు ప్రత్యేక పూజలను చేపట్టారు. భక్తులెల్లరూ విచ్చేసి స్వామివారి అన్న ప్రసాదాలను స్వీకరించారు.

# పుట్టి నాగలక్ష్మి కి మరో గౌరవం అమృతలత అపురూప అవార్డు బహుకరణ

**పెడన,మే 12 (వార్తాప్రభ) :** ఇప్పటికే ఎన్నో అవార్డులు గౌరవాలు పొందిన విశ్రాంత ప్రధానోపాధ్యాయురాలు కవయిత్రి రచయిత్రి స్టాంపుల సేకర్త పుట్టి నాగలక్ష్మి కి మరో పురస్కారం లభించింది. ఆమెకు అమృతలత అపురూప అవార్డు-2026 దక్కింది. హైదరాబాద్ లోని నాంపల్లి సురవరం ప్రతాపరెడ్డి తెలుగు యూనివర్సిటీ లోని నందమూరి తారకరామారావు కళానిలయంలో "అమృతలత-అపురూప అవార్డును నాగలక్ష్మి కి అందించారు. పోస్టల్ స్టాంపుల సేకరణ విభాగంలో ఆమెకు ఈ అవార్డును నిర్వాహకులు ప్రకటించారు. తెలంగాణ రాష్ట్ర కన్జ్యూమర్స్ డిస్ప్యూట్స్ రిడ్రెసెల్ కమిషన్ తొలి మహిళా అధ్యక్షురాలు జస్టిస్ డాక్టర్ జి రాధారాణి ప్రముఖ సినీనటి ప్రఖ్యాత నృత్య కళాకారిణి మంజుభార్గవి విద్యావేత్త డా. అమృతలత లు అవార్డును నాగలక్ష్మి కి అందజేశారు. అవార్డు అందుకున్న నాగలక్ష్మి ని



పలువురు ప్రముఖులు సాహితీవేత్తలు విద్యావేత్తలు అభినందించారు.

# పలు అంగన్వాడీ కేంద్రాలలో కిషోరి వికాస కార్యక్రమాలు



**పెడన,మే 12 (వార్తాప్రభ) :** బాలికలు తమ ఆరోగ్యాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సిడిపివో కె గ్లోరీ అన్నారు. అలాగే లైంగిక వేధింపుల నుంచి తగు జాగ్రత్తలు తీసుకోవాలని కూడా సూచించారు. కిశోరి వికాస కార్యక్రమాలలో భాగంగా మంగళవారం నాడు దేశాయిపేటలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ లక్ష్మి అంగన్వాడి కార్యకర్తలు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. అలాగే పెడన నియోజకవర్గం గూడూరు మండలం మల్లవోలు సెక్టర్ పరిధిలో మంగళవారం నాడు కిషోరి వికాస కార్యక్రమాలు జరిగాయి. తరకటూరు గాంధీ నగరం అంగన్వాడీ కేంద్రంలో 11-18 సంవత్సరాల మధ్య బాలికలు ఎలాంటి ఆహారాలు తీసుకోవాలి ఏ అంశంపై ఐసిడిఎస్ అధికారులు శిక్షణ ఇచ్చారు. సూపర్వైజర్ జన్ను రేవతి మాట్లాడుతూ బాలికలు ఆరోగ్యంవిషయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు భాల్య వివాహాలు అరికట్టాలని కూడా ఆమె సూచించారు.

# అత్యధిక సభ్యత్వాల నమోదు అభినందనీయం

-సాధకులకు ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ఘన సన్మానం



**కోడూరు,మే 12 (వార్తాప్రభ) :** అత్యధిక జనసేన పార్టీ ఉద్యమి సభ్యత్వాలు చేసిన సాధకులు అభినందనీయులు అని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. మంగళవారం కోడూరులో అత్యధికంగా 1,501 జనసేన పార్టీ ఉద్యమి సభ్యత్వాలు నమోదు చేసిన పార్టీ సాధక్ బచ్చు వెంకటేష్, అత్యధికంగా 1,237 ఉద్యమి సభ్యత్వాలు నమోదు చేసిన జనసేన పార్టీ టౌన్ అధ్యక్షులు కోట రాంబాబులను ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ స్వయంగా వారి కుటుంబ సభ్యుల సమక్షంలో ఘనంగా సత్కరించి, అభినందనలు తెలిపారు. జనసేన పార్టీ బలోపేతానికి అత్యధిక ఉద్యమి సభ్యత్వాలు కీలకంగా గెలుస్తాయన్నారు. జనసేన పార్టీ అధినేత, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు అవనిగడ్డ నియోజకవర్గాన్ని జనసేన పార్టీ ఉద్యమి సభ్యత్వాల నమోదులో అత్యున్నత స్థానంలో నిలిపిన సాధకులను అభినందించారు. కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు సిద్ధినేని అశోక్ నాయుడు, కాగిత రామారావు, జరుగు పోతురాజు, బచ్చు పూర్ణచంద్రరావు, అప్పికట్ల వినోద్ తదితరులు పాల్గొన్నారు.

# స్పార్టన్ ఏఐ టవర్ ఏసీను ఆవిష్కరించిన హైయర్ ఇండియా




**విజయవాడ,మే 12 (వార్తాప్రభ) :** ప్రపంచంలో వరుసగా 17 సంవత్సరాలుగా నంబర్ 1 గ్లోబల్ మేజర్ అప్లయెన్సెస్ బ్రాండ్‌గా నిలుస్తున్న హైయర్ అప్లయెన్సెస్ ఇండియా, ఆధునిక జీవనశైలికి శక్తి, ప్రతిష్ట, ఖచ్చితత్వం మరియు ప్రీమియమ్ డిజైన్‌కు కొత్త నిర్వచనాన్ని అందిస్తూ ఏఐ అట్మాక్స్ స్పార్టన్ ఏఐ టవర్ ఎయిర్ కండిషనర్ ను ఆవిష్కరించింది. ప్రదర్శనతో పాటు అత్యుత్తమ పనితీరును కోరుకునే గృహాల కోసం రూపొందించిన స్పార్టన్ ఏఐ టవర్ ఏసీను శక్తివంతమైన మరియు ప్రతిష్టాత్మకమైన కూలింగ్‌తో పాటు అధిక పనితీరు సామర్థ్యాన్ని అందిస్తుంది. ఆకర్షణీయమైన డిజైన్ మరియు ఆలోచనాత్మక ఇంజినీరింగ్‌తో, ఇది కేవలం ఒక గృహోపకరణంగా కాకుండా గదిలో ప్రత్యేకతను సృష్టించే ప్రధాన అంశంగా నిలుస్తుంది. శుభ్రమైన అందచందాలు మరియు సులభంగా కలిసిపోయే టెక్నాలజీని విలువ చేసే వినియోగదారుల కోసం దీనిని ప్రత్యేకంగా రూపొందించారు. హయ్యర్ స్పార్టన్ ఏఐ టవర్ ఏసీను ద్వారా హైయర్ తదుపరి తరం ఆవిష్కరణల పట్ల మరియు వినియోగదారుల అవసరాలను నిజంగా అర్థం చేసుకునే డిజైన్ పట్ల తన నిబద్ధతను ప్రతిబింబిస్తోంది. ఇందులో ఏఐ క్లైమేట్ కంట్రోల్ 2.0 వంటి అధునాతన ఫీచర్లు ఉన్నాయి. ఇది వినియోగపు అలవాట్లను నేర్చుకుని వ్యక్తిగతీకరించిన కూలింగ్‌ను అందిస్తుంది. దీనికి తోడు డైనమిక్ ఎన్విరాన్మెంటల్ ఎడాప్షన్ రియల్ టైమ్‌లో పనితీరును ఆప్టిమైజ్ చేస్తుందని హైయర్ అప్లయెన్సెస్ ఇండియా హెడ్ ఎన్ఎస్ సతీష్ తెలిపారు. ఆధునిక గృహాల జీవనశైలికి అనుగుణంగా మేధస్సుతో కూడిన, స్పందనాత్మక మరియు ఉన్నతమైన అనుభవాలను సృష్టించడం గురించి అవసరాలను ముందుగానే అంచనా వేసి, జీవితాన్ని సులభతరం చేసి, పనితీరు మరియు డిజైన్‌లో కొత్త ప్రమాణాలను నెలకొల్పేలా రూపొందించబడింది. ఈ ఆవిష్కరణతో, భారతీయ వినియోగదారుల ఆశయాలకు నిజంగా అనుసంధానమయ్యే ఉద్దేశపూర్వక, ఖచ్చితమైన మరియు సాంకేతికత ఆధారిత గృహోపకరణాల భవిష్యత్తును మేము నిర్మిస్తున్నాము," అని తెలిపారు.

# ప్రజల ఆరోగ్య సంరక్షణలో నర్సుల సేవలు అమోఘం



**కాకినాడ,మే 12 (వార్తాప్రభ) :** కమ్యూనిటీ పారామెడిక్స్ అండ్ ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్(ది పిఎంపి అసోసియేషన్ ఆఫ్ ఇండియా) కాకినాడ ఆధ్వర్యంలో కాకినాడ ఎన్టీఆర్ నగర్ పట్టణ ప్రాధమిక ఆరోగ్య కేంద్రం నందు అంతర్జాతీయ నర్సుల దినోత్సవం సందర్భంగా పీహెచ్సీ లో పేదప్రజలకు ఎనలేని సేవలందిస్తూ ప్రజల ఆరోగ్యాలను కాపాడుతున్న నర్సులకు పీఎంపీ సభ్యులు శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా పీహెచ్సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కోన దీప్తి మాట్లాడుతూ వైద్యరంగంలో పవిత్రమైన సేవలతో నర్సు వృత్తికి గౌరవాన్ని హుందాతనాన్ని తీసుకొచ్చిన నర్సులను గౌరవించుకోవడం మొట్టమొదటి ఆధునిక నర్సింగ్ వ్యవస్థాపకురాలు ఫ్లోరెన్స్ నైటింగేల్ పుట్టినరోజు సందర్భంగా అంతర్జాతీయ నర్సులు దినోత్సవం జరుపుకుంటారని ప్రజల ఆరోగ్య రక్షణలో నర్సులు అందించిన తోడ్పాటును ఈ దినోత్సవం నాడు గుర్తు చేసుకుంటూ నర్సులందరి సేవలను కొనియాడారు.ఈకార్యక్రమంలో కాకినాడ టౌన్ అధ్యక్షులు సిహెచ్ .ఏడుకొండలు కార్యదర్శి కె.శ్రీనివాస రావు కాజులూరు,కరప మండలాల అధ్యక్షులు జేవీవీ. సూర్యనారాయణ మూర్తి,ఎస్ లక్ష్మణరావు, మధు,సూర్య,రమేష్, రామకృష్ణ, ఎన్.శ్రీనివాస్, జగన్,అశోక్ తదితరులు పిఎంపిలు పాల్గొన్నారు.

# విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలి

– స్పెషల్ డ్రైవ్ చేపట్టిన అధ్యాపకులు



**కాకినాడ,మే 12 (వార్తాప్రభ) :** అర్బన్ పరిధిలోని ప్రభుత్వ మున్సిపల్ పాఠశాలలలో ఒకటి నుంచి పదో తరగతి అడ్మిషన్ల కోసం ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, మండల విద్యాశాఖ అధికారులు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నారు. ప్రతిరోజు ప్రతి ప్రభుత్వ పాఠశాల పరిధిలో ఉన్న ప్రాంతంలో తల్లితండ్రులను కలిసి తమ పాఠశాలలో ఉపాధ్యాయులు, వనరుల గురించి ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాల గురించి వివరిస్తున్నారు. విద్య పట్ల ప్రభుత్వం తీసుకుంటున్న ప్రత్యేక శ్రద్ధను వారికి వివరిస్తున్నారు. స్థానిక గోగుదానయ్యపేట మున్సిపల్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు ఇంటింటికి తిరిగి ఐదుగురు విద్యార్థులను పాఠశాలలో చేర్పించారు. ఈ కార్యక్రమంలో మోడల్ ప్రైమరీ స్కూలు ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, క్లస్టర్ ప్రధానోపాధ్యాయులు మండల విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు. మండల విద్యాశాఖ అధికారి చెవ్వూరి రవి మాట్లాడుతూ, తల్లితండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలకు పంపించడానికి సుముఖంగా ఉన్నారని ఈ విద్యా సంవత్సరం కాకినాడ అర్బన్ లో విద్యార్థుల సంఖ్య గతంకంటే పెరుగుతుందనే ఆశాభావాన్ని వ్యక్తంజేశారు. వేసవి సెలవుల్లో కూడా అంకితభావంతో ప్రచారం నిర్వహిస్తున్న ఉపాధ్యాయుల నిబద్ధతకు వారు అభినందనలు తెలిపారు.

# ముగిసిన మండల ప్రజా పరిషత్ సమావేశం



**విస్సన్నపేట,మే 12 (వార్తాప్రభ) :** స్థానిక మండల ప్రజా పరిషత్ ప్రాంగణంలో వెలుగు కార్యాలయంలో ఎంపీపీ గద్దల మల్లయ్య అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో చిన్న రాట్నాలు, మండల తాసిల్దార్ కే లక్ష్మీ కళ్యాణి, డిప్యూటీ ఎంపీడీవో రామమోహన్, ఈవో హరికృష్ణ కుమార్( విస్సన్నపేట ), నరసాపురం ఈవో స్వాతి, ఎంపీటీసీ ఓలేటి దుర్గారావు పలు శాఖల ఉద్యోగులు పాల్గొన్నారు.

# త్వరితగతిన పరిష్కరిస్తామన్న మండల తాసిల్దార్ కే లక్ష్మీ కళ్యాణి



**విస్సన్నపేట,మే 12 (వార్తాప్రభ) :** స్థానిక మండలంలో రైతుల గన్ని బ్యాగ్స్ అందించే సమస్య తో పాటు ధాన్యం కొనుగోలు తదితరాలను త్వరితగతిన పరిష్కరిస్తామని మండల తాసిల్దార్ కే లక్ష్మి కళ్యాణి హామీ ఇచ్చారు. బుధవారం 2000 బ్యాగులు అందిస్తామని రోజు విడిచి రోజు గన్ని బ్యాగులు రవాణాకు లారీలు వచ్చే విధంగా చర్యలు తీసుకుంటామని తాసిల్దార్ చెప్పినట్లు ఎన్టీఆర్ జిల్లా టిడిపి ఆర్గనైజింగ్ కార్యదర్శి నెక్కలపు శ్రీనివాసరావు( దాబా శ్రీను) తెలియజేశారు. ఈ కార్యక్రమం లో జిల్లా కార్యవర్గ నాయకులు ఆకుల రాధ రైతులు పాల్గొన్నారు.

# రి సర్వే అవగాహన కల్పించిన రెవెన్యూ శాఖ



**విస్సన్నపేట,మే 12 (వార్తాప్రభ) :** స్థానిక మండలంలో కలగర గ్రామం లో రీసర్వే అవగాహన కార్యక్రమాన్ని రీసర్వే డీటీ విజయభాస్కర్, సివిల్ సప్లై డిటి నాగరాజు రైతులకు అవగాహన కల్పించారు. తెల్ల దేవరపల్లి గ్రామం రీ సర్వే అవగాహన కార్యక్రమంలో మండల తాసిల్దార్ కే లక్ష్మి కళ్యాణి పాల్గొన్నారు. కలగర గ్రామంలో గ్రామ టిడిపి అధ్యక్షులు వల్లభనేని వెంకటేశ్వరరావు, సీనియర్ టిడిపి నాయకులు గరిమెళ్ళ భాస్కరరావు, చెరువు కమిటీ అధ్యక్షులు చెన్నారావు, తెలుగు యువత ఆర్గనైజింగ్ కార్యదర్శి తుమ్మలపల్లి అనిల్ తదితరులు పాల్గొన్నారు.

# పేదలకు అండగా కాంగ్రెస్!!

● లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ
● కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా హితం
● ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్



**పెద్దపల్లి/ గోదావరిఖని: మే 12 (వార్తాప్రభ ప్రతినిధి)** రామగుండం నియోజకవర్గం లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను ఎమ్మెల్యే ఎం.ఎస్. రాజ్ ఠాకూర్ తన క్యాంప్ కార్యాలయంలో మంగళవారం పంపిణీ చేశారు. ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేద ప్రజలకు ఈ నిధి ఎంతో ఉపయోగపడుతోందని, ప్రజల బాధలు తీర్చడంలో కాంగ్రెస్ ప్రభుత్వం సత్వరం అండగా నిలుస్తుందని ఎమ్మెల్యే సందేశం ఇచ్చారు. ప్రజల అవసరాలకు ఎప్పుడూ అండగా ఉండే కాంగ్రెస్ పాలనలో ఇలాంటి సహాయ కార్యక్రమాలు కొనసాగుతాయని ఆయన సంతోషం వ్యక్తం చేశారు. ఈ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, లబ్దిదారులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. పేదల ఆర్థిక సమస్యలను తక్షణం పరిష్కరించడంలో ముఖ్యమంత్రి సహాయ నిధి కీలకపాత్ర పోషిస్తోందని ఎమ్మెల్యే తెలిపారు.

# గ్రామీణ ప్రతిభకు క్రికెట్ వేదిక!!

● జీఎం కాలనీలో క్రికెట్ శిక్షణ ప్రారంభం ● 12-23 ఏళ్ల విద్యార్థులకు ఉచిత శిక్షణ ● క్రీడల్లో రాణించండి, భవిష్యత్తును సొంతం చేసుకోండి ● ఆర్జీ-1 జనరల్ మేనేజర్ లలిత్ కుమార్



**పెద్దపల్లి/ గోదావరిఖని: మే 12 (వార్తాప్రభ ప్రతినిధి)** హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్, కరీంనగర్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ సంయుక్తంగా రామగుండం జీఎం కాలనీ గ్రౌండ్‌లో 30 రోజుల ఉచిత వేసవి క్రికెట్ శిక్షణ శిబిరాన్ని మంగళవారం ఆర్జీ-1 జనరల్ మేనేజర్ లలిత్ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా జనరల్ మేనేజర్ మాట్లాడుతూ, చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు, గ్రామీణ ప్రతిభను వెలికితీసేందుకు ఈ శిబిరం దోహదపడుతుందని, శిక్షణ పూర్తిచేసిన వారికి కరీంనగర్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ సర్టిఫికెట్లు అందజేస్తుందని తెలిపారు, మే 12 నుంచి జూన్ 11 వరకు జరిగే ఈ శిబిరంలో 12 నుంచి 23 ఏళ్ల వయసున్న పెద్దపల్లి జిల్లా పరిసర ప్రాంతాల విద్యార్థులు పాల్గొంటున్నారు. మూడవ సంవత్సరం నిర్వహిస్తున్న ఈ శిక్షణ ద్వారా యువతకు ఆటపరమైన మెళకువలు నేర్పించడం లక్ష్యమని నిర్వాహకులు చెప్పారు. శిబిరంలో ప్రతిభ చూపిన క్రీడాకారులను తదుపరి స్థాయి టోర్నమెంట్లకు ఎంపిక చేస్తామని నిర్వాహకులు వెల్లడించారు. ప్రారంభోత్సవంలో పర్సనల్ మేనేజర్, సీనియర్ పీవో హనుమంతరావు, జిల్లా క్రికెట్ అసోసియేషన్ ప్రతినిధి కిరణ్ కుమార్ యాదవ్, కోచ్‌లు సుదేష్, రాజ్ కుమార్, శ్రీనాథ్, రవి, శేఖర్ తదితరులు హాజరయ్యారు. పెద్ద సంఖ్యలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# రైల్వే ట్రాక్ సమీపంలో రక్షణ నిర్మాణ పనులు హర్షణీయం





**హైదరాబాద్ : మే 12 :(వార్తా ప్రభ ప్రతినిధి)** పిఠాపురంలోని శ్రీ ఉమర్ అలీషా విశ్వ విజ్ఞాన విద్య ఆధ్యాత్మిక పీఠం ఎదురుగా ఉన్న రైల్వే ట్రాక్ సమీపంలో రక్షణ గోడ/ఫెన్సింగ్ నిర్మాణ పనులు చేపట్టినందుకు విజయవాడ డివిజన్ దక్షిణ మధ్య రైల్వే డివిజనల్ రైల్వే మేనేజర్, సీనియర్ డివిజనల్ ఇంజనీర్(కో-ఆర్డినేషన్) అధికారులకు ట్రావెలర్స్ అసోసియేషన్‌హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపింది. ఆర్యూబీ సమీపంలో ప్రజలు రైల్వే ట్రాక్ దాటకుండా నివారించేందుకు, భద్రత మెరుగుపర్చేందుకుప్రజలు, రైల్వే ప్రయాణికుల విజ్ఞప్తుల మేరకు ఈపనులు చేపట్టినట్లు అసోసియేషన్, జెడ్ ఆర్ యు సీసీ సభ్యులు మహమ్మద్ నూర్ తెలిపారు. ప్రజా భద్రత దృష్ట్యా రైల్వే అధికారులు వెంటనే స్పందించి పనులు ప్రారంభించడం పట్ల స్థానిక ప్రజలు, భక్తులు హర్షం వ్యక్తం చేశారు.

# ఏ-1 ఏసీపీ మడత రమేష్!!

● అవేర్నెస్‌తో ప్రజల్లో చైతన్యం ● స్మోకింగ్ జోన్లపై ఉక్కుపాదం ● ప్రజల భద్రతే లక్ష్యంగా పోలీసింగ్
● రెగ్యులర్ తనిఖీలతో కట్టుదిట్టం ● యువతలో మార్పుకు చర్యలు ● ప్రజలతో మమేకమవుతున్న ఏసీపీ సార్






**పెద్దపల్లి/ గోదావరిఖని: మే 12 (వార్తాప్రభ ప్రతినిధి)** ప్రజల భద్రతే లక్ష్యంగా విధులు నిర్వర్తిస్తున్న ఏ-1 ఏసీపీ మడత రమేష్ గౌడ్ తన ప్రత్యేక శైలితో పోలీస్ శాఖలో ఆదర్శ అధికారిగా నిలుస్తున్నారు. కేవలం నేరాల నియంత్రణకే పరిమితం కాకుండా సమాజంలో చైతన్యం పెంపొందించే దిశగా పలు సంస్కరణలను అమలు చేస్తూ ముందుకు సాగుతున్నారు. యువతను చెడు అలవాట్ల నుండి దూరంగా ఉంచేందుకు నిత్యం అవేర్నెస్ కార్యక్రమాలు నిర్వహిస్తూ, విద్యార్థులు, వ్యాపారులు, సామాన్య ప్రజలతో ప్రత్యక్షంగా మమేకమవుతున్నారు. ట్రాఫిక్ నియమాలు, సైబర్ నేరాలు, డ్రగ్స్ ముప్పు, మహిళల భద్రత, ప్రజా క్రమశిక్షణ వంటి అంశాలపై ప్రత్యేక అవగాహన సదస్సులు ఏర్పాటు చేసి ప్రజల్లో చైతన్యం నింపుతున్నారు.ప్రజా ప్రదేశాల్లో ధూమపానం నియంత్రణపై ఏసీపీ ప్రత్యేక దృష్టి సారించారు. స్మోకింగ్ జోన్లపై ఉక్కుపాదం మోపుతూ, నిబంధనలు అతిక్రమించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటున్నారు. "పొగ తాగితే బద్దలు బాషింగాలే" అన్నట్టుగా గట్టిగా హెచ్చరిస్తూ యువతకు స్పష్టమైన సందేశం ఇస్తున్నారు. రెగ్యులర్ తనిఖీలు నిర్వహిస్తూ హోటళ్లు, టీ స్టాళ్లు, పబ్లిక్ ప్రదేశాల్లో అక్రమంగా ధూమపానం చేసే వారిని గుర్తించి జరిమానాలు విధిస్తున్నారు. పోలీస్ శాఖ ప్రజలకు భయం కలిగించే వ్యవస్థ కాదని, రక్షణ కల్పించే బాధ్యతగల సంస్థ అని తన చర్యల ద్వారా చాటుతున్నారు.క్రమశిక్షణ, కఠినత్వం, ప్రజల పట్ల బాధ్యత అనే మూడు విలువలను సమన్వయం చేస్తూ ఏ-1 ఏసీపీ చేపడుతున్న సంస్కరణలు ప్రజల్లో విశేష ఆదరణ పొందుతున్నాయి. ఆయన చర్యలతో యువతలో మార్పు వస్తోందని, ప్రజల్లో పోలీసులపై విశ్వాసం మరింత పెరుగుతోందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. సమాజంలో శాంతి భద్రతల పరిరక్షణతో పాటు ఆరోగ్యకరమైన వాతావరణం కోసం కృషి చేస్తున్న ఈ పోలీస్ ఆఫీసర్ సేవలు అభినందనీయమని పలువురు ప్రశంసిస్తున్నారు.

# నర్సుల సేవలకు వార్తాప్రభ సెల్యూట్!!

● సేవలో స్ఫూర్తి నర్సులు ● ఆరోగ్య రక్షణలో నర్సుల పాత్ర అమోఘం ● తెల్ల దుస్తుల్లో వైద్య సేవలు అందించే దేవతలు ● కరోనా కాలంలో వెలకట్టలేని నర్సుల త్యాగాలు ● రాత్రింబవళ్లు సేవలందిస్తున్న నర్సింగ్ సిబ్బంది






**పెద్దపల్లి/ గోదావరిఖని: మే 12 (వార్తాప్రభ ప్రతినిధి)**ప్రాణాలను కాపాడే వైద్య రంగంలో వైద్యులు ఎంత ముఖ్యమో, నర్సుల పాత్ర కూడా అంతే కీలకమైంది. రోగి ఆసుపత్రి గుమ్మం దాటిన క్షణం నుంచి కోలుకుని ఇంటికి వెళ్లే వరకు ప్రతి దశలో అండగా నిలిచేది నర్సులే. సేవాభావం, ఓర్పు, కరుణ, బాధ్యతతో నిరంతరం విధులు నిర్వర్తిస్తూ మానవత్వానికి ప్రతిరూపంగా నిలుస్తున్నారు. ప్రతి సంవత్సరం మే 12న నిర్వహించే అంతర్జాతీయ నర్సుల దినోత్సవం, ఈ మహత్తర సేవలకు గౌరవ సూచకంగా జరుపుకుంటారు. ఆధునిక నర్సింగ్ వ్యవస్థకు మార్గదర్శకురాలైన ఫ్లోరెన్స్ నైటింగేల్ జయంతిని పురస్కరించుకుని ప్రపంచవ్యాప్తంగా ఈ దినోత్సవాన్ని నిర్వహించడం ఆనవాయితీగా కొనసాగుతోంది. ఆసుపత్రుల్లో రోగుల ఆరోగ్య పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించడం, మందులు సమయానికి అందించడం, అత్యవసర పరిస్థితుల్లో వైద్యులకు సహకరించడం, రోగులకు మానసిక ధైర్యం చెప్పడం వంటి ఎన్నో బాధ్యతలను నర్సులు ఎంతో అంకితభావంతో నిర్వర్తిస్తుంటారు. బాధతో ఉన్న రోగులకు ఆప్యాయంగా మాట్లాడి ధైర్యం చెప్పే నర్సులను చాలామంది "సేవామూర్తులు"గా అభివర్ణిస్తుంటారు. కేవలం చికిత్సలోనే కాకుండా రోగుల కుటుంబ సభ్యులకు కూడా అవసరమైన సూచనలు అందిస్తూ ఆరోగ్య వ్యవస్థలో ప్రధాన స్థంభాలుగా నిలుస్తున్నారు. ప్రత్యేకించి కరోనా మహమ్మారి సమయంలో ప్రపంచం మొత్తం భయాందోళనలకు గురైన వేళ, ప్రాణాలకు తెగించి సేవలందించిన నర్సుల త్యాగం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయింది. తమ కుటుంబాలను దూరంగా ఉంచుకుని రోజులు తరబడి ఆసుపత్రుల్లోనే విధులు నిర్వహిస్తూ అనేక మంది రోగుల ప్రాణాలను కాపాడారు. ఆ క్లిష్ట సమయంలో నర్సులు చూపిన ధైర్యం, సేవాభావం సమాజానికి గొప్ప స్ఫూర్తిగా నిలిచింది. ఎంతో మంది నర్సులు స్వయంగా అనారోగ్యానికి గురైనా సేవను మాత్రం ఆపలేదు. అందుకే నర్సింగ్ వృత్తిని కేవలం ఉద్యోగంగా కాకుండా మానవ సేవగా భావిస్తారు. గ్రామీణ ప్రాంతాల నుంచి మహానగరాల వరకు ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో వేలాది మంది నర్సులు రాత్రింబవళ్లు సేవలందిస్తున్నారు. అనేక సవాళ్లు, ఒత్తిళ్లు ఎదురైనా తమ బాధ్యతను మరువకుండా ప్రజల ఆరోగ్య రక్షణలో ముందుంటున్నారు. అత్యవసర విభాగాలు, ఐసీయూలు, ప్రసూతి వార్డులు, శస్త్రచికిత్స విభాగాలు వంటి కీలక ప్రాంతాల్లో నర్సుల సేవలు లేకుండా వైద్య వ్యవస్థ ముందుకు సాగడం అసాధ్యమనే చెప్పాలి. అంతర్జాతీయ నర్సుల దినోత్సవాన్ని పురస్కరించుకుని పలు ఆసుపత్రులు, నర్సింగ్ కళాశాలల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. సేవా రంగంలో విశేష కృషి చేసిన నర్సులను సన్మానించి వారి సేవలను కొనియాడారు. వైద్యులు, ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ సమాజ ఆరోగ్య సంరక్షణలో నర్సుల పాత్ర అపారమని పేర్కొన్నారు. "రోగికి వైద్యం మందులతో మాత్రమే కాదు... ప్రేమతో, ధైర్యంతో కూడా అందాలి. ఆ బాధ్యతను నర్సులు అద్భుతంగా నిర్వర్తిస్తున్నారు" అని అభిప్రాయపడ్డారు. నేటి సమాజంలో ఆరోగ్య సేవల ప్రాముఖ్యత పెరుగుతున్న తరుణంలో నర్సుల సేవలు మరింత అవసరమవుతున్నాయి. సేవే పరమోన్నత ధర్మమని నమ్ముతూ నిస్వార్థంగా పనిచేస్తున్న నర్సులందరికీ ఈ దినోత్సవం సందర్భంగా సమాజం కృతజ్ఞతలు తెలియజేస్తోంది. మానవత్వానికి నిజమైన నిర్వచనం నర్సులేనని పలువురు కొనియాడుతున్నారు. నర్సు అంటే కేవలం ఇంజెక్షన్ ఇచ్చే వ్యక్తి కాదు, రోగికి కొండంత ధైర్యాన్నిచ్చే ఆత్మబంధువు. ఈ నర్సుల దినోత్సవం సందర్భంగా వారి త్యాగాన్ని, అంకితభావాన్ని ప్రతి ఒక్కరం గుర్తించి గౌరవిద్దాం.

# ప్రభుత్వ పాఠశాలలో ఆధునిక ప్రయోగశాల!!

● విద్యార్థుల భవిష్యత్తుకు ఉజ్వల వెలుగులు
● అభివృద్ధితోనే సమాధానం చెబుతున్నాం
● రామగుండం ప్రతినిధి ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్






**పెద్దపల్లి/ గోదావరిఖని: మే 12 (వార్తాప్రభ ప్రతినిధి)** రామగుండంలో విద్యా రంగం కొత్త దశలోకి అడుగుపెట్టింది. ఎమ్మెల్యే ఎం.ఎస్. రాజ్ ఠాకూర్ ఆధ్వర్యంలో, తెలంగాణ విద్యాశాఖ, విద్యా మౌలిక సదుపాయాల సంస్థతో కలిసి నిర్మించిన ఆధునిక హైస్కూల్ ప్రయోగశాల భవనం విద్యార్థుల భవిష్యత్తుకు వెలుగులు నింపనుంది. పెద్దపల్లి జిల్లా పీఎం జెడ్ పి హెచ్ ఎస్ పాఠశాలలో రూ.1.50 కోట్ల వ్యయంతో నిర్మించిన ఈ ప్రయోగశాల, ప్రభుత్వ పాఠశాలల్లోనూ ప్రైవేట్ స్థాయి సదుపాయాలు అందించాలన్న సంకల్పానికి ప్రతీకగా నిలిచింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, విద్యార్థులు శాస్త్రీయ దృక్పథంతో ముందుకు సాగేందుకు ఇది బలమైన వేదికగా మారుతుందని అన్నారు. రాబోయే రోజుల్లో మరిన్ని నిధులు తీసుకువచ్చి పాఠశాల అభివృద్ధిని వేగవంతం చేస్తానని హామీ ఇచ్చారు. అభివృద్ధి పనులలో భాగంగా రామగుండం పట్టణంలో రోడ్లతో పాటు సెంట్రల్ లైటింగ్, డ్రైనేజ్ సదుపాయాలు ఏర్పాటు చేసి ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరుస్తున్నామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వంతో పేదలకు సహకారం అందిస్తూ, విమర్శలు చేసే వారికి అభివృద్ధి ద్వారానే సమాధానం ఇస్తామని స్పష్టం చేశారు. ఈ ప్రయోగశాల ప్రారంభోత్సవం విద్యార్థులకే కాకుండా మొత్తం పట్టణానికి ఒక కొత్త ఆశాకిరణంగా నిలిచింది.

# ప్రజాస్వామ్యంలో పత్రికల పాత్ర అత్యంత కీలకం : డీజీపీ సి.వి. ఆనంద్



**హైదరాబాద్, మే 12 :(వార్తా ప్రభ ప్రతినిధి)** ప్రపంచంలో అత్యంత ప్రభావశీలమైన సంస్థల్లో మీడియా ఒకటని, జర్నలిస్టులు సమాజ అభివృద్ధి కోసం కృషి చేయాలని తెలంగాణ రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డీజీపీ) సి.వి.ఆనంద్ పేర్కొన్నారు. మంగళవారం తెలంగాణ డీజీపీ రాష్ట్ర కార్యాలయంలో తెలంగాణ జర్నలిస్ట్ అసోసియేషన్ మీడియా డైరెక్టరీని ఆయన ఆవిష్కరించారు.ఈ సందర్భంగా డీజీపీ సి.వి. ఆనంద్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో పత్రికల పాత్ర అత్యంత కీలకమని అన్నారు. రాష్ట్రంలోని రాజకీయ, ఆర్థిక, విద్య, వైద్య మరియు సాంకేతిక రంగాల అభివృద్ధిపై మరింత దృష్టి సారించాల్సిన అవసరం ఉందని సూచించారు.ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు మరియు ప్రజల మధ్య జర్నలిస్టులు వారధిగా వ్యవహరించాలని ఆయన పేర్కొన్నారు.ఈ సమావేశంలో తెలంగాణ జర్నలిస్ట్ అసోసియేషన్ రాష్ట్ర కోశాధికారి సీనియర్ పాత్రికేయులు చిలుకూరు అఖిలేష్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యానికి నాల్గవ స్థంభంగా భావించే జర్నలిజం వృత్తికి అంకితభావంతో సేవలందిస్తున్న జర్నలిస్టుల సంక్షేమం కోసం కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.తెలంగాణ జర్నలిస్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు పగుడాకుల బాలా స్వామి , ప్రధాన కార్యదర్శి జూలురు రమేష్ , ఉపాధ్యక్షుడు లక్కాకుల ప్రవీణ్ కుమార్ తదితరులు నూతన డీజీపీ సి.వి. ఆనంద్‌ను కలిసి అభినందనలు తెలిపారు.

# హైదరాబాద్

## కుత్బుల్లాపూర్‌లో ఘనంగా హనుమాన్ జయంతి వేడుకలు : పాల్గొన్న కె.యం.ప్రతాప్





**కుత్బుల్లాపూర్, మే 12, (వార్తాప్రభ) :** కుత్బుల్లాపూర్ గ్రామ పరిధిలోని శ్రీ వేణుగోపాలస్వామి ఆలయ ఆవరణలో వెలసిన శ్రీ ఆంజనేయస్వామి సన్నిధిలో హనుమాన్ జయంతి వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. హనుమాన్ భక్తమండలి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ఉత్సవాలకు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు కె.యం.ప్రతాప్ ముఖ్య అతిథిగా విచ్చేసి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

**అన్నదాన కార్యక్రమం ప్రారంభం** పూజా కార్యక్రమాల అనంతరం భక్తుల కోసం ఏర్పాటు చేసిన భారీ అన్నదాన కార్యక్రమాన్ని ప్రతాప్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆంజనేయ స్వామి ఆశీస్సులు నియోజకవర్గ ప్రజలందరిపై ఉండాలని, ప్రతి ఒక్కరూ ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని వేడుకున్నట్లు తెలిపారు. ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భక్తులు మరియు గ్రామస్థులతో పాటు పలువురు ముఖ్యులు ఆలయ ధర్మకర్త ఠాకూర్ రాజేందర్ సింగ్, కుత్బుల్లాపూర్ గ్రామ సీనియర్ సిటిజన్స్ ప్రధాన కార్యదర్శి పెద్ది మల్లేశం, ఉపాధ్యక్షులు గోపగోని నరహరి గౌడ్, కోశాధికారి రత్నం మురళి గౌడ్, సలహాదారులు గోపాలకృష్ణ ఆచార్య, సంయుక్త కార్యదర్శి సత్యనారాయణ రెడ్డి, నార్ల కంటి ఎట్టయ్య, కె.యల్. చారి, గొరిగే సత్తయ్య. వీరితో పాటు హనుమాన్ భక్త మండలి సభ్యులు, కుత్బుల్లాపూర్ గ్రామవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

## శేరిలింగంపల్లి నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయం.

### ఎమ్మెల్యే అరికపూడి గాంధీ



**శేరిలింగంపల్లి,మే 12 (వార్తాప్రభ):**శేరిలింగంపల్లి డివిజన్ పరిధిలోని వెంకటేశ్వర కాలనీ,స్ప్రింగ్ వ్యాలీ కాలనీలలో రూ.1.24 కోట్ల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్లు,వరద నీటి కాల్వ నిర్మాణ పనులకు పి ఏ సీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శేరిలింగంపల్లి నియోజకవర్గ అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మార్గదర్శకత్వంలో మౌలిక వసతుల అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నామని పేర్కొన్నారు.హఫీజ్‌పేట్--మసీద్‌బండ లింక్ రోడ్డులో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.అభివృద్ధి పనులను నాణ్యతతో,త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో నాయకులు,కార్యకర్తలు,కాలనీ వాసులు పాల్గొన్నారు. లింగంపల్లి నియోజకవర్గ అభివృద్ధి లక్ష్యం శాసనసభ్యులు గాంధీ

శేరిలింగంపల్లి,మే 12 (వార్తాప్రభ):శేరిలింగంపల్లి డివిజన్ పరిధిలోని వెంకటేశ్వర కాలనీ,స్ప్రింగ్ వ్యాలీ కాలనీలలో రూ.1.24 కోట్ల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్లు,వరద నీటి కాల్వ నిర్మాణ పనులకు పి ఏ సీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శేరిలింగంపల్లి నియోజకవర్గ అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మార్గదర్శకత్వంలో మౌలిక వసతుల అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నామని పేర్కొన్నారు.హఫీజ్‌పేట్--మసీద్‌బండ లింక్ రోడ్డులో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.అభివృద్ధి పనులను నాణ్యతతో,త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో నాయకులు,కార్యకర్తలు,కాలనీ వాసులు పాల్గొన్నారు.

## గర్భిణీలు, బాలింతల కోసం ఉచిత ఎలక్ట్రిక్ వాహన సేవ ప్రారంభం

**నాగర్ కర్నూల్ మే 12 (వార్తాప్రభ)** హైదరాబాద్‌కు చెందిన సామాజిక సేవా సంస్థ గుడ్ యూనివర్స్, ఆర్సేసియం సంస్థ సహకారంతో మంజూరైన ఎలక్ట్రిక్ బ్యాటరీ వాహనాన్ని రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు గారు ప్రారంభించారు.కొల్లాపూర్ బస్ స్టాండ్ నుంచి రామాపురం శివారులో ఉన్న మాతా శిశు సంరక్షణ హాస్పిటల్‌కు వచ్చే గర్భిణీలు, బాలింతలకు ఈ వాహనం ద్వారా ఉచిత రవాణా సౌకర్యం కల్పించడం హర్షణీయమని మంత్రి పేర్కొన్నారు. రోగులకు మెరుగైన, పర్యావరణహితమైన రవాణా సేవలు అందుబాటులోకి రావడం సంతోషకరమన్నారు.ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు అనుష్క, వంశీ, హాస్పిటల్ సూపరింటెండెంట్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

# ఎడిటోరియల్

## ‘దళపతి’ ప్రజాస్వామ్యం: ఒకే ఒక్కడున్నా.. ఒకే విలువ!

: తమిళనాడు శాసన సభలో విజయ్ మొదటి స్పీచ్ ఇచ్చారు. ఈసందర్భంగా ఆయన వేష భాషలు, అందులోని భావాలపై తమిళనాడు ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.. ఇంకా చెప్పాలంటే ప్రతిపక్షాలు కూడా బయటకు కాకున్నా లోలోపల సంతోషంగా ఉన్నాయనే చెప్పాలి. ఎందుకంటే విజయ్ ప్రసంగంలో ‘సమానం’ అన్న పదం పలు సార్లు రావడమే ఇందుకు నిదర్శనం. రాజకీయాల్లో సాధారణంగా ‘మెజారిటీ’ అనేదే ఒక పెద్ద బూచీ. వంద సీట్లు ఉన్న పార్టీ నాయకుడి గొంతు సభలో వినబడుతుంది, ఒక్క సీటు ఉన్న పార్టీ నాయకుడి గొంతు నొక్కబడుతుంది. కానీ, తమిళనాడు రాజకీయ తెరపైకి కొత్తగా వచ్చిన ‘దళపతి’ విజయ్ మాత్రం తన టీవీకే మార్కు ప్రజాస్వామ్యానికి సరికొత్త నిర్వచనం ఇస్తున్నారు. ‘బలం ఉన్నవాడిదే మాట కాదు.. భావం ఉన్నవాడిదే బాట’ అన్నట్లుగా ఆయన చేసిన తాజా వ్యాఖ్యలు ఇప్పుడు చిన్న పార్టీల్లో కొత్త ఆశలు రేకెత్తిస్తున్నాయి. అందరూ తలో దారి చూసుకుంటున్న వేళ, ‘ఒక్క ఎమ్మెల్యే ఉన్నా సరే.. మాకు అందరూ సమానమే’ అని చెప్పడం వినడానికి బాగానే ఉన్నా, ఇది నిజంగానే ‘మంచి’ని స్వీకరించడమా లేక ‘మద్దతు’ను కూడగట్టడమా అన్నది ఇప్పుడు అసలైన పాయింట్! తమిళనాడు ప్రభుత్వం ఏర్పాటులో మద్దతిచ్చిన కాంగ్రెస్, ఇతర చిన్న పార్టీలను ఉద్దేశిస్తూ విజయ్ చేసిన ఈ వ్యాఖ్యలు ఇప్పుడు చర్చనీయాంశమయ్యాయి. ‘మీ పార్టీకి ఒక్క అభ్యర్థి ఉన్నా సరే, మీ అభిప్రాయానికి టీవీకే అభిప్రాయంతో సమానంగా విలువ ఉంటుంది’ అని విజయ్ ప్రకటించారు. అంటే, భవిష్యత్తులో అసెంబ్లీలో 108 మంది టీవీకే ఎమ్మెల్యేలు ఒకవైపు, ఒక్కడంటే ఒక్కడున్న చిన్న పార్టీ ఎమ్మెల్యే మరోవైపు ఉన్నా.. త్రాసులో ఇద్దరి తూకం సమానమన్నమాట! ఇది విన్న సీనియర్ రాజకీయ నేతలు ‘మరీ ఇంతటి ఉదారత్వమా?’ అని ముక్కున వేలేసుకుంటున్నారు. సినిమాలో హీరో అందరినీ సమానంగా చూసినట్లు, రియల్ పాలిటిక్స్‌లో కూడా అందరికీ ‘ఈక్వల్ సీటు’ ఇస్తానని విజయ్ హామీ ఇస్తున్నారు. సూచనల విషయంలో విజయ్ ఒక క్లారిటీ ఇచ్చారు. ‘మంచి సూచనలు స్వీకరించబడతాయి, చెడు సూచనలు తిరస్కరించబడతాయి’ అని తేల్చేశారు. అయితే, ఇక్కడే ఒక చిన్న మెలిక ఉంది. ఏది మంచి? ఏది చెడు? అనేది డిసైడ్ ఎవరు చేస్తారు. ఖచ్చితంగా అది విజయ్ వద్దే ఉంటుంది. అంటే, చిన్న పార్టీలు ఇచ్చే సలహా టీవీకే సిద్ధాంతాలకు సరిపోతే అది ‘మంచి’, లేకపోతే అది ‘చెడు’ అన్నమాట. ‘నీ అభిప్రాయం చెప్పే స్వేచ్ఛ నీకుంది.. అది వినాలా వద్దా అని నిర్ణయించే అధికారం నాకుంది’ అనే ఈ సాఫ్ట్ డిక్టేటర్‌షిప్ వెనుక ఒక సినిమాటిక్ స్టైల్ స్పష్టంగా కనిపిస్తోంది. ఒక్క ఎమ్మెల్యే మాత్రమే ఉన్న పార్టీలు సాధారణంగా పెద్ద పార్టీల నీడలో బతికేస్తుంటాయి. కానీ విజయ్ మాత్రం వారికి ‘టీవీకేతో సమాన విలువ’ అని ఆఫర్ ఇవ్వడంతో, ఆ ఒక్క ఎమ్మెల్యే ఇప్పుడు తనను తాను ఒక ‘కింగ్ మేకర్’ లా ఫీలవుతున్నాడు. అసెంబ్లీలో తన వాయిస్ కి కూడా విజయ్ వాయిస్ అంత వెయిట్ ఉంటుందని తెలియడంతో, ఆ ఒక్క అభ్యర్థి పార్టీలు ఇప్పుడు తమ మేనిఫెస్టోలను మళ్లీ తిరగరాసుకునే పనిలో పడ్డాయి. ఒకే ఒక అభ్యర్థి ఉన్నా సరే, పది లక్షల ఓట్లు తెచ్చుకున్న పార్టీతో సమానంగా ట్రీట్ చేస్తామనడం, రాజకీయాల్లో ఒక వింతైన ‘సోషలిజం’ అని చెప్పాలి. విజయ్ ఈ స్థాయిలో తగ్గి ఉండడం వెనుక ఒక పెద్ద స్కెచ్ ఉందనేది విశ్లేషకుల మాట. కొత్తగా ప్రభుత్వం ఏర్పాటు చేసిన తరుణంలో, ఎవరినీ నొప్పించకుండా అందరినీ కలుపుకుపోవడం ద్వారా తన ఇమేజ్ ను ‘ప్రజాస్వామ్యవాది’గా మార్చుకోవాలని ఆయన చూస్తున్నారు. ‘నేను హీరోని, నా మాటే వినాలి’ అని కాకుండా ‘మనం అందరం కలిసి నడుద్దాం’ అని చెప్పడం ద్వారా చిన్న చిన్న శక్తులను కూడా తన వైపు తిప్పుకుంటున్నారు. అయితే, ఈ ‘సమాన విలువ’ అనేది అసెంబ్లీలో బిల్లుల ఆమోదం దగ్గర కూడా అలాగే ఉంటుందా? కాలమే నిర్ణయించాలి. మొత్తానికి, విజయ్ ఈ ‘సమానత్వ’ రాజకీయం చూస్తుంటే.. ‘స్క్రీన్ మీద హీరో అందరినీ రక్షించినట్లు, అసెంబ్లీలో అందరినీ గౌరవించేస్తారన్నమాట” అనిపిస్తోంది. ఒక్క అభ్యర్థి ఉన్నా సరే రాజభోగం కల్పిస్తామంటున్న ఈ ఆఫర్ చూసి, ఇతర రాష్ట్రాల్లోని చిన్న పార్టీలు కూడా తమిళనాడుకు షిఫ్ట్ అయిపోతాయేమో!

## అన్నదాత సుఖీభవ..

**కొనియాడుతున్న అన్నార్తులు**

**కళ్ళే లలిత వీధిలో 54నెలలు నుండి ప్రతి నెల అన్నసమారాధన.**



**విజయవాడ పశ్చిమ మే12. (వార్తా ప్రభ ప్రతినిధి)** ఎటువంటి లాభాపేక్ష లేకుండా పేద ప్రజలకు, అన్నార్తులకు ప్రతి నెల అన్నసమారాధన కార్యక్రమం నిర్వహిస్తున్న స్వర్గీయ కళ్ళే లలిత ట్రస్ట్ అధ్యక్షుడు కళ్ళే నాగేశ్వరరావును పేదలు, అన్నార్తులు అన్నదాత సుఖీభవ అని కొనియాడుతున్నారు. స్థానిక సింగ్ నగర్ కళ్ళే లలిత వీధిలో గత 54నెలలు నుండి ప్రతి నెల అన్నసమారాధన కార్యక్రమం కళ్ళే లలిత ట్రస్ట్ అధ్యక్షుడు కళ్ళే నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగానే మంగళవారం పేదలకు అన్నసమారాధన నిర్వహించారు. ఈ సందర్భంగా కళ్ళే లలిత ట్రస్ట్ అధ్యక్షుడు కళ్ళే నాగేశ్వరరావు పాల్గొని స్వర్గీయ కళ్ళే లలిత విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పేదలకు, అన్నార్తులకు అన్నదానం నిర్వహించారు. సింగ్ నగర్ ప్రాంతంలో స్వర్గీయ కళ్ళే లలిత జ్ఞాపకార్థం, కళ్ళే లలిత వీధిలో ప్రతి నెల అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని, ట్రస్ట్ డైరెక్టర్లు సేవలు ఎనలేనిదని అన్నారు. స్వర్గీయ కళ్ళే లలిత భౌతికంగా దూరమైన నాటి నుండి ప్రతి నెల 12వ తేదీన క్రమం తప్పకుండా గత 54నెలలు నుండి పేదలకు సింగ్ నగర్ ప్రాంతంలోని కళ్ళే లలిత వీధి వద్ద అన్నసమారాధన కార్యక్రమం నిర్వహిస్తున్నామని అన్నారు. తమకు కలిగిన ఆర్థిక స్థోమత బట్టి పేదలకు ఆహారాన్ని అందజేయడం జరుగుతుందని అన్నారు. కళ్ళే లలిత బ్రతికి ఉన్న రోజులలో పేదల ఆకలి తీర్చాలని తెలపడం జరిగిందని అందుకే ప్రతి నెల వారికి భోజనాలను ఏర్పాటు చేయడం జరుగుతుందని కళ్ళే నాగేశ్వరరావు అన్నారు. రానున్న రోజులలో కళ్ళే లలిత ట్రస్ట్ సేవలు ద్వారా పేదలకు మరింత సహాయ సహకారాలు అందిస్తామని అన్నారు. ఈకార్యక్రమంలో డైరెక్టర్లు కళ్ళే సీతా మహాలక్ష్మిముప్పూరి హరీష్, ఎమ్. జశ్విన్, జి. ధ్రువన్, చందన సురేష్, ప్రసాద్ స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# ఇంద్రకీలాద్రిపై వైభవంగా ముగిసిన హనుమజ్జయంతి వేడుకలు





**విజయవాడ పశ్చిమ మే 12 :(వార్తా ప్రభ ప్రతినిధి)** విజయవాడ ఇంద్రకీలాద్రిపై శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వారి దేవస్థానంలో మంగళవారం హనుమజ్జయంతి వేడుకలు అత్యంత వైభవంగా, భక్తిశ్రద్ధలతో పూర్తయ్యాయి. వైదిక కమిటీ సూచనల మేరకు, ఘాట్ రోడ్డులోని శ్రీ అభయ ఆంజనేయ స్వామి, ప్రధాన ఆలయ ప్రాంగణంలోని క్షేత్రపాలక ఆంజనేయ స్వామి మరియు మెట్ల మార్గంలోని స్వామివారి ఆలయాల్లో ఉదయం 6 గంటల నుండే ప్రత్యేక కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. భక్తుల సమక్షంలో స్వామివారికి శాస్త్రోక్తంగా అభిషేకములు మరియు (ఆకుపూజ) నిర్వహించబడ్డాయి. రంగురంగుల పుష్పాలతో శోభాయమానంగా అలంకరించిన ఆలయాల్లో భక్తులు స్వామివారిని దర్శించుకుని, తీర్థప్రసాదాలు స్వీకరించారు. అధికారుల సమన్వయంతో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఈ వేడుకలు ఘనంగా ముగిశాయి. హనుమజ్జయంతి వేడుకల ముగింపు అత్యంత వైభవంగా, భక్తిశ్రద్ధలతో పూర్తయ్యాయి. ఈ వేడుకల్లో దేవస్థాన పాలకమండలి అధ్యక్షులు బొర్రా రాధాకృష్ణ తమ సతీమణితో కలిసి, అలాగే కార్యనిర్వహణాధికారి (ఈ ఓ) పీకే సీనానాయక్ తమ సతీమణితో కలిసి పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారితో పాటు దేవస్థాన ధర్మకర్తల మండలి సభ్యులు కూడా ఈ పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

**నాలుగు ప్రధాన వేదికలపై వేడుకలు:** వైదిక కమిటీ సూచనల మేరకు నాలుగు ప్రాంతాలలో వేడుకలు ఘనంగా జరిగాయి:ఘాట్ రోడ్డులోని శ్రీ అభయ ఆంజనేయ స్వామి వారి ఆలయం.ప్రధాన ఆలయ ప్రాంగణంలోని క్షేత్రపాలక శ్రీ ఆంజనేయ స్వామి వారి ఆలయం.మెట్ల మార్గంలోని శ్రీ ఆంజనేయ స్వామి వారి ఆలయం.సీతానగరం ఉపాలయమైన శ్రీ ఆంజనేయ స్వామి వారి ఆలయం.ఈ నాలుగు ఆలయాల్లో స్వామివారికి శాస్త్రోక్తంగా అభిషేకములు, తమలపాకులతో అర్చన లు నిర్వహించదమైనది. చైర్మన్ , మరియు ఈఓ భక్తులకు కల్పించిన ఏర్పాట్లను పర్యవేక్షించి, స్వామివారి కృప అందరికీ కలగాలని ఆకాంక్షించారు. రంగురంగుల పుష్ప అలంకరణల మధ్య భక్తులు స్వామివారిని దర్శించుకోవడంతో ఇంద్రకీలాద్రి హనుమ నామస్మరణతో మారుమోగింది.

## శ్రీ విజయ దుర్గా రామలింగేశ్వర పంచముఖ ఆంజనేయ స్వామి వారి దేవస్థానంలో హనుమాన్ వైభవంగాజయంతి



**విజయవాడ పశ్చిమ మే 12 :(వార్తా ప్రభ ప్రతినిధి)** శ్రీ విజయ దుర్గా రామలింగేశ్వర పంచముఖ ఆంజనేయ స్వామి వారి దేవస్థానంలో హనుమాన్ జయంతి సందర్భంగా దేవాలయంలో ప్రాతః కాలం నుండి పంచముఖ ఆంజనేయ స్వామివారికి 11 ద్రవ్యములతో అభిషేకము మరియు నాగవల్లితో సహస్రనామార్చన కార్యక్రమము నిర్వహించామని ఆలయ అర్చకులు చింతలపాటి వెంకట సుబ్రహ్మణ్య శాస్త్రి, సహాయా అర్చకులు చింతలపాటి నాగ వెంకట పవన్ కుమార్ శర్మ లు తెలిపారు, మంగళవారం మిల్క్ ప్రాజెక్ట్ భీమన వారి పేట వద్ద వేంచేసి ఉన్న శ్రీ విజయ దుర్గ రామలింగేశ్వర పంచముఖ ఆంజనేయ స్వామి దేవస్థానంలో హనుమాన్ జయంతిని పురస్కరించుకొని పంచముఖ ఆంజనేయ స్వామి వారికి వివిధ రకాల పండ్ల రసాలతో 11 సుగంధ ద్రవ్యాలతో స్వామి వారికి అభిషేకం నిర్వహించారు, ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత 11 సంవత్సరాలుగా ఈ దేవాలయంలో హనుమాన్ జయంతి కార్యక్రమాన్ని అంగరంగ వైభవంగా అత్యంత భక్తి శ్రద్ధలతో ప్రాతః కాలం నుంచి స్వామివారి పూజా కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు, అనంతరం స్వామివారి కళ్యాణం, కమిటీ వారి పర్యవేక్షణలో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా తీర్థ ప్రసాదాలను అందజేశారు, హనుమాన్ జయంతి సందర్భంగా మధ్యాహ్నం సమయంలో స్వామివారి ఉత్సవ మూర్తుల దాతలు తమ్మిన సతీష్, శ్రీమతి వాణి దంపతులచే స్వామివారికి అభిషేకాలు కళ్యాణం భక్తులకు అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు.



## బిల్లులు చెల్లించకుంటే ఆత్మహత్యలే శరణ్యం

# ఆర్.డబ్ల్యూ.ఎస్ కాంట్రాక్టర్ల ఆందోళన

- విజయవాడ ధర్నా చౌక్‌లో నిరసన..
- రూ. 1050 కోట్ల బకాయిలు చెల్లించాలని డిమాండ్





**విజయవాడ పశ్చిమ మే 12 :(వార్తా ప్రభ ప్రతినిధి)** పెండింగ్ బిల్లుల విడుదల కోసం నవ్యాంధ్ర ఆర్.డబ్ల్యూ.ఎస్, జేజేఎం, కాంట్రాక్టర్లు విజయవాడలోని ధర్నా చౌక్ వద్ద భారీ నిరసన కార్యక్రమం చేపట్టారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చిత్రపటాలను ప్రదర్శిస్తూ తమ ఆవేదనను వ్యక్తం చేశారు. ప్రభుత్వం నుంచి తమకు సుమారు రూ. 1050 కోట్ల మేర బిల్లులు రావాల్సి ఉందని అధికారులు రేపు మాపు అంటూ తాత్సారం చేస్తున్నారని వారు మండిపడ్డారు.

**వివక్ష చూపుతున్నారు:** ఈ సందర్భంగా కాంట్రాక్టర్లు మాట్లాడుతూ ప్రభుత్వం బడా కార్పొరేట్ సంస్థలకు, పెద్ద కంపెనీలకు మాత్రమే బిల్లులు చెల్లిస్తూ తమ పట్ల వివక్ష చూపుతోందని ఆరోపించారు. మార్చి 31వ తేదీ నాటికి పెండింగ్ బిల్లులు ఇస్తామని చెప్పి మాట తప్పారని వాపోయారు. ఒకవైపు పాత బకాయిలు చెల్లించకుండానే, మరోవైపు పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులు తమపై ఒత్తిడి తీసుకువస్తున్నారని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. పెండింగ్ బిల్లులను తక్షణమే ఎఫ్.ఐ.ఎఫ్.ఓ’ విధానంలో చెల్లించాలి మార్చి 31వ తేదీ వరకు ఉన్న బకాయిలన్నింటినీ వెంటనే క్లియర్ చేయాలి పెండింగ్ పనుల విషయంలో అధికారులు ఇస్తున్న ఒత్తిడిని ఆపాలి వారు డిమాండ్ చేశారు.

**ఆత్మహత్యలే శరణ్యం:** బిల్లుల చెల్లింపు విషయంలో ప్రభుత్వం తమకు చుక్కలు చూపిస్తోందని, ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న తమను తక్షణమే ఆదుకోవాలని వారు కోరారు. ప్రభుత్వం స్పందించని పక్షంలో మూకుమ్మడిగా ఆత్మహత్యలు చేసుకోవడం తప్ప తమకు మరో మార్గం లేదని కాంట్రాక్టర్లు తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. ప్రభుత్వం ఇప్పటికైనా కళ్ళు తెరిచి తమ సమస్యను పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు.

# పెరుగుతున్న ఎండల దృష్ట్యా వి ఎం సి రక్షణ చర్యలు

**విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర**





**విజయవాడ పశ్చిమ మే 12 :(వార్తా ప్రభ ప్రతినిధి)** నగరంలో ఎండ తీవ్రత పెరుగుతున్నందున విజయవాడ నగరపాలక సంస్థ ప్రజల కోసం రక్షణ చర్యలు తీసుకుంటుందని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. మంగళవారం ఉదయం తన పర్యటనలో భాగంగా మహాత్మా గాంధీ రోడ్డు, అతారత్తయ్య వీధి, సాంబమూర్తి రోడ్డు, కోనాడా సూర్యప్రకాష్ రోడ్డు, గవర్నర్పేట, దుర్గాపురం, గులాబీ తోట ప్రాంతాలన్నీ పర్యటించి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో పెరుగుతున్న ఎండలను దృష్టిలో పెట్టుకొని నగరపాలక సంస్థ వివిధ రక్షణ చర్యలు చేపడుతుందని అందులో భాగంగా ప్రధాన ట్రాఫిక్ కూడళ్ళో నీడను ఏర్పాటు చేయడమే కాకుండా అన్నా క్యాంటీన్లలో కూడా క్యూ లైన్ ల వద్ద నీడను ఏర్పాటు చేశామని అన్నారు. నగరంలో గల మినీ గార్బేజ్ ట్రాన్స్ఫర్ స్టేషన్లో ఉన్న కాంపాక్టర్ బిన్ లలో ఎటువంటి మరమ్మతులు లేకుండా అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ వాటిని మరమ్మతులు చేస్తూ వ్యర్థ సేకరణలో ఎటువంటి లోపం లేకుండా ఎప్పటికప్పుడు తొలగించాలని అధికారులను ఆదేశించారు. నగరాన్ని అందంగా ఉంచేందుకు నూతనంగా వాల్ పెయింటింగ్ లు, మ్యూరల్ ఆర్ట్స్ వేయించమని అన్నారు. స్వచ్ఛ సర్వేక్షన్ లో భాగంగా ఈ పెయింటింగ్ లు నగరానికి అందంగా మాత్రమే కాకుండా ప్రజలకు అవగాహన కల్పించే విధంగా చిత్రాలు ఉండాలని అన్నారు. తదుపరి రాణి గారి తోట వద్ద గల అన్న క్యాంటీన్ ను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అన్న క్యాంటీన్లో వచ్చే ప్రజలకు ఎండ తీవ్రత ఎక్కువగా ఉండటంతో క్యూ లైన్లు వద్ద నీడ ఉండేటట్టు చర్యలు తీసుకోమని అధికారులకు గతంలో ఆదేశించగా గులాబీ తోట అన్న క్యాంటీన్లో ఆ ఏర్పాట్లను పరిశీలించారు. అన్న క్యాంటీన్లో ఎటువంటి వసతులు కావాలన్నా సందేహం లేకుండా వెంటనే ప్రజలకు ఇబ్బంది కలగకుండా చేయాలని ప్రజలకు ఎటువంటి సమస్య రాకుండా చూసుకోవాలని అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ మరమతులన్నీ పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ పర్యటనలో అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ అన్నపూర్ణ, శానిటరీ సిబ్బంది పాల్గొన్నారు.

## సిద్ధేశ్వరి పీఠం ఉత్తరాధికారి శ్రీ దత్తేశరానంద భారతి స్వామి వారి ఆశీస్సులు పొందిన వెలంపల్లి, మల్లాది



**విజయవాడ పశ్చిమ మే 12 :(వార్తా ప్రభ ప్రతినిధి)** కృష్ణ లంక పాత పోస్ట్ ఆఫీస్ రోడ్డులోని కుర్తాళం శ్రీ సిద్ధేశ్వరి పీఠ మహాసంస్థానాన్ని మంగళవారం మాజీ మంత్రి, పశ్చిమ నియోజకవర్గ వైసీపీ ఇంచార్జ్ వెలంపల్లి శ్రీనివాసరావు మరియు మాజీ ఎమ్మెల్యే, సెంట్రల్ నియోజకవర్గ వైసీపీ ఇంచార్జ్ మల్లాది విష్ణు సందర్శించారు. ఈ సందర్భంగా పీఠంలో వేంచేసి ఉన్న కుర్తాళం శ్రీ సిద్ధేశ్వరి పీఠం ఉత్తరాధికారి శ్రీ శ్రీ శ్రీ దత్తేశరానంద భారతి స్వామి వారిని వారు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ క్రమంలో స్వామివారికి పాదాభివందనం చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శ్రీ దత్తేశరానంద భారతి స్వామి వారు వెలంపల్లి శ్రీనివాసరావు, మల్లాది విష్ణులను ఆశీర్వదించారు. లోకకళ్యాణం మరియు భక్తి మార్గంలో పీఠం చేస్తున్న సేవలను ఈ సందర్భంగా నేతలు కొనియాడారు.

## అవసరాలు గుర్తిస్తేనే లాభాల బాట







**విజయవాడ పశ్చిమ, మే 12:-(వార్తా ప్రభ ప్రతినిధి)** వినయోగదారుల అవసరాలను కచ్చితంగా గుర్తించి, వాటికి విలువనిచ్చి, అందుకు తగిన వస్తువులు, సేవలను ఉత్పత్తి చేసినప్పుడే వ్యాపారం లాభాల బాట పడుతుందని ప్రముఖ బిజినెస్ మేనేజ్మెంట్ ట్రైనీ డాక్టర్ ఎస్.అపూర్వ అన్నారు. కె.బి.ఎన్ కళాశాల ఐహబ్ ఫ్యూచర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం “బిజినెస్ మోడల్ కాన్వాస్ & బిజినెస్ మోడల్ ఫిట్” అంశంపై అవగాహన కార్యక్రమం జరిగింది. ముఖ్యవక్తగా పాల్గొన్న అపూర్వ మాట్లాడుతూ స్విగ్గీ, అమూల్, రాపిడో వంటి సంస్థలు వినియోగదారుల అవసరాలను ఏవిధంగా అంచనా వేసాయో ఉదాహరణలు ఇస్తూ, విద్యార్థులకు ఆచరణాత్మక అవగాహన కలిగించారు. వ్యాపారరంగంలో బిజినెస్ మోడల్ కాన్వాస్ ప్రాధాన్యత వివరించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ జి.కృష్ణవేణి మాట్లాడుతూ విద్యార్థుల్లో ఔత్సాహిక వ్యాపార దృక్పథాన్ని పెంపొందించేందుకు ఈ తరహా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అధ్యాపకులు జె.బాలాజీ, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.వేంకటేశ్వరరావు, పి.ఎల్.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## జన గణనను వేగవంతం చేయండి

**విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర**



**విజయవాడ పశ్చిమ మే 22 :(వార్తా ప్రభ ప్రతినిధి)** జన గణనను వేగవంతం చేయాలని చీఫ్ సెన్సెస్ ఆఫీసర్ మరియు విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. మంగళవారం ఉదయం భవానీపురం, నాలుగు స్తంభాల సెంటర్, కబేళా, సితార సెంటర్ ప్రాంతాలన్నీ పర్యటించి ఎన్యుమేరేటర్లు మరియు సూపర్వైజర్లతో చేసే జన గణన ను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వారితో పాటు స్వయంగా తానే ఒక కుటుంబంతో మాట్లాడి, ప్రశ్నలన్నింటినీ అడిగి, జనగణన ప్రక్రియను పూర్తి చేయించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, జన గణన దేశ అభివృద్ధి ప్రణాళికలకు, సంక్షేమ పథకాల అమలుకు ఎంతో కీలకమైన ప్రక్రియ అని తెలిపారు. ప్రతి ఇంటిని సందర్శించి సరైన వివరాలను సేకరించాలని, ప్రజలకు జనగణన ప్రాముఖ్యతను వివరించి సహకారం పొందాలని సూచించారు. ఎన్యుమేరేటర్లు కేటాయించిన ప్రాంతాలలో వేగవంతంగా సర్వే పూర్తి చేయడంతో పాటు, సేకరించిన వివరాల్లో ఖచ్చితత్వం పాటించాలని సూచించారు. జనగణనలో ఎటువంటి పొరపాట్లు జరగకుండా సూపర్వైజర్లు నిరంతరం పర్యవేక్షణ నిర్వహించాలని ఆదేశించారు. ప్రభుత్వానికి అవసరమైన గణాంకాల సేకరణలో జనగణన అత్యంత ప్రాముఖ్యత కలిగిన ప్రక్రియ కావడంతో ప్రతి ఒక్కరు బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని పేర్కొన్నారు. ఈ పర్యటనలో డిప్యూటీ సిటీ ప్లానర్ చంద్రబోస్, సూపర్వైజర్లు జోష్నా నాగశ్రీ, రాజేష్, సిబ్బంది పాల్గొన్నారు.

## 11 రోజుల సమ్మె కాలం ఇంజనీరింగ్, పార్కు, పారిశుద్ధ్య కార్మికుల జీతం చెల్లించండి.

**కలెక్టర్ కి ఏఐటియుసి విజ్ఞప్తి**



**విజయవాడ పశ్చిమ మే 12 :(వార్తా ప్రభ ప్రతినిధి)** ఇంజనీరింగ్, పార్కు కార్మికుల జీతాల పెంపుదల కోసం వారికి సంఘీభావంగా 11 రోజులపాటు పారిశుధ్య, ఇంజనీరింగ్, పార్కు కార్మికులు చేసిన సమ్మె కాలానికి జీతాలు చెల్లించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసి ఉన్నదని, నగరపాలక సంస్థ అధికారులు తక్షణం స్పందించి జీతాలు చెల్లించాలని నగరపాలక సంస్థ స్పెషల్ ఆఫీసర్ మరియు జిల్లా కలెక్టర్ కి విజయవాడ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నగర ప్రధాన కార్యదర్శి బుద్దె రాజా, అధ్యక్షులు ఎస్వీఎస్ చలం విజ్ఞప్తి చేశారు. మంగళవారం ఉదయం మాచవరం సర్కిల్ -6 మలేరియా కార్యాలయం వద్ద జరిగిన కారణాల మీటింగులో వారు పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కనీస వేతనం 26 వేల రూపాయలు చెల్లిస్తామని ఎన్నికలలో హామీ ఇచ్చిన కూటమి ప్రభుత్వం నేటి వరకు అమలు చేయలేదని, చాలీచాలని జీతాలతో జీవనం సాగిస్తున్నారని అన్నారు. అన్ని రకాల వాతావరణ పరిస్థితులలోనూ నిబద్ధతగా పారిశుధ్య పనులు నిర్వహిస్తున్న కార్మికులను ఆర్థికంగా ఆదుకోవాలని కోరారు.

# నర్సులే రోగుల ప్రాణాలు కాపాడే యోధులు

- సేవలో మానవత్వం నర్సింగ్ వృత్తి గొప్పతనం
- సంతృప్తికర వైద్య సేవలో నర్సుల పాత్ర క్రియాశీలకం
- వనరుల సద్వినియోగంతో ప్రైవేటుకు దీటుగా జిజిహెచ్ సేవలు
- అన్ని సమస్యలు త్వరలో పరిష్కరిస్తాం ఎంపీ కేశినేని చిన్ని వెల్లడి



**విజయవాడ పశ్చిమ మే 12 :(వార్తా ప్రభ ప్రతినిధి)** విజయవాడ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో నర్సింగ్ డే వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విజయవాడ పార్లమెంట్ సభ్యులు ఎంపీ కేశినేని చిన్ని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ జిల్లా కలెక్టర్ లక్ష్మీ షా ఏపీ ఎన్జీవోస్ అధ్యక్షుడు విద్యాసాగర్ పాల్గొన్నారు ఈ సందర్భంగా రోగుల ప్రాణాలు కాపాడే యోధులు నర్సింగ్ సిబ్బందేనని ఎంపీ చిన్ని అన్నారు.ఈ సందర్భంగా ఎంపీ చిన్ని మాట్లాడుతూ రోగుల ప్రాణాలు కాపాడడంలో నర్సులు పాత్ర అత్యంత కీలకమని తెలిపారు వైద్యులతో సమానంగా నర్సులు కూడా అహర్నిశలు కష్టపడుతూ రోగులకు ధైర్యం భరోసా కల్పిస్తూ చక్కని చిరునవ్వుతో ఆత్మీయతతో రోగాన్ని దూరం చేస్తారని అన్నారు వైద్యరంగంలో కీలకమైన నర్సు వృత్తికి గౌరవాన్ని హుందాతనాన్ని తీసుకువచ్చిన ఫ్లోరెన్స్ నైటింగేల్ విగ్రహా ఆవిష్కరణ చేసి పూలమాలలతో ఘన నివాళి అర్పించారుప్రజల ఆరోగ్య రక్షణలో నర్సులు అందించిన తోడ్పాటును ఈ సందర్భంగా స్మరించుకున్నారు అంతర్జాతీయ నర్సుల దినోత్సవం శుభాకాంక్షలు తెలియజేశారు రిటైర్డ్ నర్సింగ్ సూపర్డెంట్ జి అక్కమ్మ 50వేల రూపాయలు అందించి మరొక 150000 నర్సింగ్ అసోసియేషన్ ద్వారా సమకూర్చి ఫ్లోరెన్స్ విగ్రహం ఏర్పాటు చేసినట్లు తెలియజేశారు. ఉన్న వనరులు సౌకర్యాలను సద్వినియోగం చేసుకుంటూనే జిజిహెచ్ ద్వారా అందించే వైద్య సేవలో 80 శాతానికి పైగా సంతృప్తి స్థాయి నమోదు కావడం లో నర్సుల పాత్ర కీలకమని పేర్కొన్నారు ఆసుపత్రి తో పాటు నర్సింగ్ కళాశాల వసతి గృహానికి సంబంధించిన సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళమని త్వరలోనే ఇవన్నీ పరిష్కారం అవుతాయని తెలిపారు ఆసుపత్రిలో ప్రైవేటు ఆసుపత్రులకు దీటుగా క్లిష్టమైన శస్త్ర చికిత్సలు నిర్వహించి రోగుల మన్ననలను పొందుతుందని ప్రభుత్వ చొరవతో పాటు దాతల సహకారంతో ఆసుపత్రి అభివృద్ధికి కృషి చేస్తానని ఎంపీ చిన్ని అన్నారు ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ జిల్లా కలెక్టర్ లక్ష్మీషా ఏపీ ఎన్జీవోస్ అధ్యక్షుడు విద్యాసాగర్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి సూపరిండెంట్ పాల్గొన్నారు.

## అర్హులైన వారికి మీడియా అక్రిడిటేషన్లు మంజూరు : జిల్లా కలెక్టర్ డీకే బాలాజి.



**మచిలీపట్నం మే 12 :(వార్తా ప్రభ ప్రతినిధి)**జిల్లాలో అర్హత కలిగిన ప్రతి జర్నలిస్టుకూ ప్రభుత్వ నిబంధనల ప్రకారం మీడియా అక్రిడిటేషన్లు మంజూరు చేస్తున్నామని జిల్లా కలెక్టర్ డీకే బాలాజి తెలిపారు.మంగళవారం మధ్యాహ్నం కలెక్టరేట్ లోని తన ఛాంబర్లో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వ జీవో నెం.84లో పేర్కొన్న నిబంధనల మేరకు నాలుగో సమావేశంలో మొత్తం 44 మంది పాత్రికేయులకు మీడియా అక్రిడిటేషన్లు మంజూరు చేసినట్లు తెలిపారు. ఇంకా అర్హత కలిగిన జర్నలిస్టులు ఆన్లైన్లో సమర్పించిన దరఖాస్తుల్లో వివిధ కారణాలతో పెండింగ్లో ఉన్న వాటిని పరిశీలించి తదుపరి సమావేశంలో అక్రిడిటేషన్లు మంజూరు చేయడానికి చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. తొలుత సమావేశంలో జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి, జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీ సభ్య నిర్వాహకులు ఎం వెంకటేశ్వర ప్రసాద్ మీడియా అక్రిడిటేషన్ కు సంబంధించిన ప్రభుత్వ జీవో నెంబర్ 84 లోని నియమ నిబంధనలు, పాత్రికేయుల ఆన్లైన్ దరఖాస్తుల పరిశీలన ప్రక్రియను కమిటీ చైర్మన్ జిల్లా కలెక్టర్ కు వివరించారు.సమావేశంలో జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీ సభ్యులు, వివిధ జర్నలిస్టు సంఘాల ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

## కలిసికట్టుగా పార్టీ కార్యాలయాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయం

- యువనేత లోకేష్ స్పూర్తితో ప్రతి ప్రాంతంలో పార్టీ కార్యాలయం ఏర్పాటు
- అధికారం ఉంటే పరిష్కారం ప్రతిపక్షమైతే పోరాటమే టిడిపికి తెలుసు
- 14వ డివిజన్లో టిడిపి పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించిన ఎంపీ కేశినేని చిన్ని



**విజయవాడ పశ్చిమ మే 12 :(వార్తా ప్రభ ప్రతినిధి)** విజయవాడ తూర్పు నియోజకవర్గం 14వ డివిజన్ లో తెలుగుదేశం పార్టీ కార్యాలయాన్ని ఎంపీ కేశినేని చిన్ని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ టిడిపి సీనియర్ నాయకులు బొప్పన భవకుమార్ కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్యకర్తలు నాయకులు ఎంపీ చిన్నికి ఘన స్వాగతం పలికారు.ఈ సందర్భంగా ఎంపీ చిన్ని మాట్లాడుతూ విజయవాడ తూర్పు నియోజకవర్గం లోని 14వ డివిజన్ టిడిపి కార్యాలయాన్ని ప్రారంభించడం ఆనందంగా ఉందని అన్నారు ఒక కొత్త తరం పాత తరం నాయకులంతా కలిసి కార్యాలయాన్ని ప్రారంభించుటశీ గొప్ప పరిణామం ఎంపీ చిన్ని అన్నారు యువ నేత లోకేష్ నేతృత్వంలో ప్రతి ప్రాంతంలోనూ కార్యాలయం ఏర్పాటు అవ్వడం మంచి విషయమని చిన్ని పేర్కొన్నారు.టిడిపి నాయకులు అధికార పార్టీలో ఉన్నప్పుడు సమస్యలు పరిష్కరించే దిశగా అదే ప్రతిపక్షంలో ఉంటే పోరాటం చేసే దిశగానే ఉంటారని చిన్ని పేర్కొన్నారు గత పాలకులు ఎవరు ప్రజల దగ్గరకు వెళ్ళిందే లేదు ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వం లేని కూటమి ప్రభుత్వం సంక్షేమం అభివృద్ధి పైనే దృష్టి సాదించాయి అని తెలిపారు. మూడు పార్టీలు కలిసి సమిష్టిగా ముందుకెళ్తున్నాయని ఎంపీ చిన్ని స్పష్టం చేశారు ప్రజలకు సేవ చేయడమే కూటమి ముందుకు వెళుతుందని చిన్ని అన్నారు.ఈ కార్యక్రమంలో డివిజన్ ప్రెసిడెంట్ కర్ణ రమేష్ బాబు, డివిజన్ ఇంచార్జ్ గరికపాటి బద్రి , కాపు కార్పొరేషన్ డైరెక్టర్ రత్నం రమేష్, మాజీ కార్పొరేటర్ ముమ్మినేని ప్రసాద్ ,బిజెపి నాయకులు పోతంశెట్టి నాగేశ్వరరావు ,యార్లగడ్డ సందీప్ జనసేన నాయకులు గాదిరెడ్డి అమ్ములు ఎడ్లపల్లి నాగరాజు టిడిపి డివిజన్ కమిటీ సభ్యులు వీరంకి డాంగే కుమారి నర్రా కిషోర్ కర్ణ కోటేశ్వరరావు కుమార్ పాతిరెడ్డి వెంకట్రావు కనిశెట్టి కొండలు రావు సుంకర వెంకన్న ఫాతిమా జ్యోతి కెల్లా రమేష్ ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.

## పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలు యువతలో పెంపొందించాలి....

జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ.



**మచిలీపట్నం మే 12 :(వార్తా ప్రభ ప్రతినిధి):**జిల్లాలో పరిశ్రమలకు అనుగుణంగా అవసరమైన నైపుణ్యాలు యువతలో పెంపొందించే విధంగా ఐటిఐ లను తీర్చిదిద్దాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఉదయం జిల్లా కలెక్టర్ నగరంలోని వారి చాంబర్లో ఐటిఐ, పరిశ్రమల అధికారులు నైపుణ్యాభివృద్ధి అధికారులతో సమావేశం నిర్వహించి యువతకు ఉపాధి అవకాశాలు పెంపొందించే విధంగా దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రధానమంత్రి సేతు పథకం కింద 200 కోట్ల రూపాయల తో పారిశ్రామిక శిక్షణా సంస్థలను (ఐటిఐ ) పటిష్టపరుచుటకు సంకల్పించిందన్నారు. అందులో 50 శాతం కేంద్ర ప్రభుత్వము, 33% రాష్ట్ర ప్రభుత్వము, మిగిలిన 17 శాతం పరిశ్రమ నెలకొల్పే భాగస్వామి భరించాల్సి ఉంటుందన్నారు. ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా పరిశ్రమలకు కావలసిన నైపుణ్యాలు కలిగిన యువతను తయారు చేయుటకు తగిన విధంగా శిక్షణ ఇవ్వాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఇందుకోసం ఉమ్మడి కృష్ణాజిల్లా విజయవాడలో ఆధునికరించిన ఉపాధి శిక్షణ హబ్ను, గుడివాడ నూజివీడు, నిజాంపట్నం లలో క్లస్టర్లను ఏర్పాటు చేయవలసి ఉందన్నారు ఆసక్తి గలవారు ఈనెల 18వ తేదీ లోపల ఆన్లైన్లో దరఖాస్తు చేయవలసి ఉంటుందన్నారు. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే క్రమంలో కౌశలం పథకం కింద 60 వేల మంది రిజిస్ట్రేషన్ చేసుకోగా అందులో దశలవారీగా 10,వేల మంది పరీక్షలు రాశారని, వారిలో 1480 మందికి వివిధ కంపెనీల నుండి ఇంటర్వ్యూకు పిలవడం జరిగిందన్నారు. జిల్లాలో నైపుణ్యం కలిగిన యువతీ యువకులందరికి ఉపాధి అవకాశాలు లభించే విధంగా కృషి చేయాలని అధికారులను ఆదేశించారు. వన్ డిస్ట్రిక్ట్ వన్ స్కిల్ ప్లాన్ కింద 8 డిమాండ్ రంగాలలో ఉపాధి అవకాశాలు లభించే విధంగా యువతలో నైపుణ్యాలు పెంపొందించేందుకు ప్రత్యేక చొరవ చూపాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ ఆర్ వెంకటరావు, జి ఎస్ డబ్ల్యూ ఎస్ జిల్లా సమన్వయకర్త రవికాంత్, జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి నరేష్, జిల్లా ఉపాధి కల్పనాధికారి బ్రహ్మం, సీడ్యాప్ ప్లేస్మెంట్ ఎగ్జిక్యూటివ్ కవిత, నాక్ ఏడి పవన్ కుమార్,, గుడివాడ ఐటిఐ ప్రిన్సిపాల్ మంజులాదేవి తదితర అధికారులు పాల్గొన్నారు.

## చేజర్లలో ఘనంగా హనుమాన్ జయంతి వేడుకలు

అన్నదానం నిర్వహించిన హనుమాన్ ఉత్సవ కమిటీ సభ్యులు





**చేజర్ల మే 12 (వార్తాప్రభ)** చేజర్ల గ్రామం బస్టాండ్ ఆవరణలో వెలసిన శ్రీ అభయ ఆంజనేయస్వామి విగ్రహం దగ్గర భక్తుల కోలాహలంగా ఉండటం కనువిందు చేసింది.మంగళవారం శ్రీ హనుమాన్ జయంతి సందర్భంగా అంగరంగ వైభవంగా ఆంజనేయుడికి ఆకుపూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించడం జరిగినది.ఈ కార్యక్రమంలో చేజర్ల సొసైటీ అధ్యక్షులు బూదళ్ళ వీర రాఘవరెడ్డి దంపతులు పూజ కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భక్తిపారవస్యంతో మండల ప్రజలు భక్తులు ఆంజనేయ స్వామి ఆశీర్వాదాలు పొందుటకు పెద్ద ఎత్తున తరలివచ్చి ఆయన ను దర్శించుకోవడం జరిగినది.అలాగే మధ్యాహ్నం ఆంజనేయ స్వామి విగ్రహం దగ్గర అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించి భక్తులకు అన్న ప్రసాదం నైవేద్యం పంచిపెట్టడం జరిగినది.చేజర్ల గ్రామ ప్రజల సహాయ సహకారాలతో ఈ పూజా కార్యక్రమాలు అన్నదాన కార్యక్రమాలు ఏటా నిర్వహించడం మాకు చాలా ఆనందంగా ఉందని ఈ సందర్భంగా వారు తెలిపారు. అలాగే శ్రీ హనుమాన్ జయంతి సందర్భంగా సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు కోలాట నృత్యాలతో ఘనంగా శ్రీ ఆంజనేయ స్వామి వారి ఊరేగింపు అంగరంగా వైభవంగా జరుపుతామని ఈ సందర్భంగా శ్రీ హనుమాన్ ఉత్సవ కమిటీ చేజర్ల వారు తెలిపారు.

## దేవస్థానం ఎదుట బస్సులు ఆపక భక్తుల ఇక్కట్లు.

మందుబాబులకు అడ్డాగా బస్టాండ్ ఆవరణ.





**మోపిదేవి:అవనిగడ్డ:మే12(వార్తాప్రభ ప్రతినిధి)** ఉభయ తెలుగు రాష్ట్రాల్లో సుప్రసిద్ధ సుబ్రహ్మణ్య క్షేత్రంగా భక్తజనుల నీరాజనాలు అందుకుంటున్న మోపిదేవి దేవస్థానం ఎదుట ఆర్టీసి బస్సులు ఆపకపోవడంతో భక్తులు తీవ్ర ఇబ్బందికి గురవుతున్నారు. మ.స్వామివారి దర్శనానికి ఆలయానికి వచ్చే భక్తులను బస్టాండ్ లో దించి వేసి ,అక్కడే బస్సులు ఎక్కేందుకు అనుమతిస్తుండటంతో భక్తులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు.వేసవి ఎండ తీవ్రత నేపథ్యంలో స్వామివారి దర్శనానికి వచ్చిన వృద్ధులు, వికలాంగులు ,మహిళల పరిస్థితి దయనీయంగా తయారైంది.పూర్వం నుండి దేవస్థానం ఎదుట ఆర్టీసి బస్సులు ఆపేవారు . పెరుగుతున్న భక్తుల రద్దీ నేపథ్యంలో మంగళవారం, ఆదివారం గతంలోలా దేవస్థానం ఎదుట బస్సులు ఆపటంపై ఆంక్షలు విధించారు. భక్తుల సౌకర్యార్థం సదరు ఆంక్షలు ఆహ్వానించదగినవే కాని బస్టాండ్ వద్ద నుంచి దేవస్థానం వరకు కనీసం మహిళలు, వృద్ధులు , వికలాంగుల కైనా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసి ఉంటే బాగుండేదన్న అభిప్రాయం పలువురు వ్యక్తం చేస్తున్నారు.దేవస్థానం పరిసరాల్లో ప్రభుత్వ భూములు ఆక్రమించి ట్రాఫిక్ కు ఇబ్బంది కలిగిస్తున్న అక్రమార్కులపై కొరడా ఝులిపించి ఆక్రమణలను తొలగిస్తే దేవస్థానం ప్రాంతంలో అసలు ట్రాఫిక్ ఇబ్బంది ఉండదనేది కొందరి అభిప్రాయం.ప్రధాన రహదారి అంచుల వరకూ ఉన్న ఆక్రమణలు తొలగించకుండా మండు వేసవిలో భక్తులను ఇబ్బందులకు గురి చేయడం సరికాదని పలువురు ఆక్రోశం వ్యక్తం చేస్తున్నారు.సంభందిత అధికారులు స్పందించి గతంలో వలే దేవస్థానం ఎదుట బస్సులు ఆపేలా లేదా భక్తుల సౌకర్యార్థం దేవస్థానం నుండి బస్టాండ్ వరకు ప్రత్యేక రవాణా సౌకర్యం ఏర్పాటు చేయాలని పలువురు భక్తులు కోరుతున్నారు.

**మందుబాబులకు అడ్డాగా బస్టాండ్ ఆవరణ.** మోపిదేవి బస్టాండ్ ప్రక్కనే వైన్ షాప్ ఉండటంతో ఆవరణ మందుబాబులకు అడ్డాగా మారింది.రద్దీగా ఉన్న మోపిదేవి బస్టాండ్ ఆవరణలో ఉన్న వేప , రాగి వృక్షాల నీడలో ప్రయాణికులకు (భక్తులకు)ఇబ్బందికరంగా మందుబాబులు బహిరంగ మద్య సేవనం చేస్తున్నారు.అడిగేవారు ఎవరూ లేకపోవడంతో మందుబాబులు యధేచ్ఛగా తమపని కానిచ్చేస్తున్నారు.బస్టాండ్ ఆవరణలోనే మందుబాబులు బహిరంగంగా మద్యం సేవించడం పట్ల బస్సుల కోసం బస్టాండ్ లో వేచివున్న భక్తులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

## అమ్మ గొప్ప సందేశం



సహనంతో విజయము
వినయంతో గౌరవము
వచ్చును ఖచ్చితంగా
కష్టపడితే ఫలితము
సజ్జనుల సహవాసము
జీవితాన మంచితనము
ఎంతైనా క్షేమకరము
నిలుపుకున్న గొప్పతనము
క్షమాపణతో శత్రుత్వము
దోషానికి ప్రాయశ్చిత్తము
తప్పకుండా కలుగుతుంది
మది మలినం తొలగుతుంది
గురుదేవుల బాటలోన
కన్నవారి మాటలోన
దాగుంది గొప్పతనము
అనురాగాల కోటలోన

**-గద్వాల సోమన్న,**
ఎమ్మిగనూరు,

## గొల్లపల్లి ఎస్టీ కాలనీలో కిశోరి వికాసం కార్యక్రమం



**చేజర్ల మే 12 (వార్తాప్రభ)** కిషోరి వికాసంలో భాగంగా చేజర్ల మండలంలోని గొల్లపల్లి ఎస్టి కాలనీ నందు కిషోరీ వికాసం కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమం నందు సిడిపిఓ సునీలత పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 11 సంవత్సరాల నుండి 18 సంవత్సరాల వరకు కిషోరీ బాలికలందరూ వారి అవసరాలు వారు ఎదుర్కొనే ఇబ్బందులు కానీ మరి ఏదైనా సమస్య కాని వారి అభిప్రాయాలను రాతపూర్వకంగా కిషోరి బాలికలు అందరూ తెల్ల కాగితం పై వ్రాయించి వారి యొక్క అభిప్రాయాలను గోప్యంగా ఉంచి వారు రక్తహీనత లేకుండా సంపూర్ణ ఆరోగ్యంతో ఉండటానికి తీసుకోవాల్సిన మరియు ప్రతి ఒక్కరు స్కూలు మరియు కాలేజీలు ఎవ్వరు కూడా మానివేయకుండా అందరూ చదువుకోవాలని కిషోర్ సూచించారు.బాలికల అందరికీ విద్య ఆరోగ్యం భద్రత వంటి విషయాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని మరియు ఆపద కలిగినప్పుడు హెల్ప్ లైన్ నెంబర్ల గురించి చైల్డ్ హెల్ప్ లైన్1098 సఖి వన్ స్టార్ సెంటర్181 అని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ ఎం.పద్మ అంగన్వాడీ కార్యకర్తలు విజయకుమారి పోలమ్మ పద్మ తదితరులు పాల్గొన్నారు.

## ఎస్సీ కాలనీలో ఘనంగా హనుమాన్ జయంతి



**చేజర్ల మే 12 (వార్తాప్రభ)** మండల కేంద్రమైన చేజర్ల గ్రామ పంచాయతీలోని ఎస్సీ కాలనీ నందు శ్రీ ఆంజనేయస్వామి జయంతి సందర్భంగా కాలనీవాసులు ఘనంగా జయంతి కార్యక్రమాలు నిర్వహించడం జరిగింది. శ్రీ హనుమాన్ జయంతి సందర్భంగా ఆంజనేయ స్వామికి పట్టు వస్త్రాలతో అలంకరణ చేయడం జరిగినది.అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమలో కాలనీ పెద్దలు పిల్లలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయడం జరిగింది. ఏటా అంగరంగ వైభవంగా ఆంజనేయస్వామి ఆలయం నందు భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తారు. ముందుగా భక్తులు ఆంజనేయ స్వామిని దర్శించుకుని తీర్థప్రసాదాలు నైవేద్యాలు పూజా కార్యక్రమాలు నిర్వహించి శ్రీ హనుమాన్ ఆశీస్సులు పొందారు.

## కడప లాంటి సంఘటనలు పునరావృత్తం కాకుండా చూడాలి

ఇలాంటి సంఘటనతో ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలి

మైనార్టీ మంత్రి ఎన్ఎండి ఫారూఖ్ కు అల్తాఫ్ బాబా వినతి



**ఇబ్రహీంపట్నం, మే 12(వార్తా ప్రభ ప్రతినిధి):** కడప అల్లర్లు లాంటి సంఘటనలు మళ్లీ పునరువృతం కాకుండా ప్రభుత్వం పటిష్ట చర్యలు తీసుకోవాలని మైనార్టీ శాఖ మంత్రి ఎన్ఎండి ఫారుక్ కు విజ్ఞప్తి చేశారు సూఫీ మత గురువులు అల్తాఫ్ బాబా. విజయవాడ ఒక ప్రైవేటు కార్యక్రమంలో మంత్రిని కలిసారు అల్తాఫ్ బాబా. ఈ సందర్భంగా ఇలాంటి సంఘటనల వల్ల ప్రజల్లో సోదర భావం దెబ్బతింటుందని, అనవసరపు అభద్రతాభావం ఏర్పడుతుందని ఇది రాష్ట్రానికి మంచిది కాదని అన్నారు. వెంటనే స్పందించిన మంత్రి ఇలాంటి సంఘటనల సమయంలో విద్వేషాలు రెచ్చగొట్టకుండా అందరూ సమన్వయం పాటించాలని, సోదర భావంతో ఉండాలని సూచించారు. ఎప్పటికప్పుడు కడప జిల్లా కలెక్టర్ ఎస్పీ లకు ఫోన్ చేసి శాంతియుతంగా సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు.

## ఘనంగా హనుమజ్జయంతి వేడుకలు



**సంగం మే 12 (వార్తాప్రభ ప్రతినిధి)** సంగం మండలం జంగాలదొరువు గ్రామం లోని అభయగిరి అభయాంజనేయ స్వామి ఆలయంలో హనుమాన్ జయంతి వేడుకలను అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి..అభిషేకాలు చేశారు.ఆలయ ప్రాంగణం లో ప్రత్యేక హోమాలు నిర్వహించారు.భక్తులు స్వామి వారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.ఈ పూజలకు ఎదురు బాలాజీ,విజయ దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు.సంగం లోని అభయాంజనేయ స్వామి ఆలయంలో హనుమాన్ జయంతి పూజలు వైభవంగా నిర్వహించారు.

## పోక్సో చట్టం, బాల్య వివాహాలపై అవగాహన ఉండాలి



**ఇబ్రహీంపట్నం, మే 12 (వార్తా ప్రభ ప్రతినిధి):** పోక్సో చట్టం, బాల్య వివాహాలపై కిశోర బాలలు అవగాహన కలిగి ఉండాలని ఐసీడీఎస్ సూపర్ వైజర్ మాధవి అన్నారు. కిశోరి బాలికల వేసవి శిబిరాల్లో భాగంగా ఇబ్రహీంపట్నం శివాలయం అంగన్ వాడీ కేంద్రంలో మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ లైంగిక దాడులు, నేరాల నుంచి చిన్నారులను రక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. 18 ఏళ్ల లోపు పిల్లలపై జరిగే లైంగిక వేధింపులు, దాడులను అరికట్టడానికి చట్టం అమలులో ఉందన్నారు. కార్యక్రమంలో అంగన్ వాడీ కార్యకర్తలు శివలీల, ధనలక్ష్మి, కిశోరి బాలలు పాల్గొన్నారు.

## అక్రమ వాటర్ ప్లాంట్లను తొలగించాలంటూ బస్తి వాసుల ఆగ్రహం.

**తహశీల్దార్ కార్యాలయం ముందు ధర్నా**




**కూకట్ పల్లి, మే 12(వార్తాప్రభ):** కూకట్ పల్లి మండల్ వెంకటేశ్వర నగర్ డివిజన్ లోని పాపిరెడ్డి నగర్ లో అక్రమంగా కొనసాగుతున్న వాటర్ ప్లాంట్లను తొలగించి నిర్వహకులపై చర్యలు తీసుకివాలని బస్తి వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఊట్ల చంద్రారెడ్డి బస్తి వాసులతో కలిసి మంగళవారం తహశీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. అక్రమ వాటర్ ప్లాంట్లను ఏర్పాటు చేసి విక్రయిస్తూ నీటి సంక్షోభానికి పాల్పడుతున్న వ్యక్తులకు అధికారులు సహకరిస్తునన్నారాని ఆరోపించారు. నీటి వనరులు దోచేస్తూ అక్రమ వ్యాపారం చేస్తూన్న వ్యక్తుల కోసం బస్తి లోని ప్రజలకు నీళ్ల ఇబ్బందులను సృష్టించడం సబబు కాదన్నారు. ఇదే విషయమై గత కొంత కాలంగా వివిధ విభాగాల అధికారులకు వినతులు అందిస్తూ సమస్యను పరిష్కరించాలని బస్తి వాసుల విజ్ఞపులను పక్కనపెట్టి అక్రమ వాటర్ ప్లాంట్ నిర్వాహకులకు సహకరించడం దురదృష్టకరమన్నారు. నీటి ఎద్దడికి కరణమవుతున్న వ్యక్తులపై స్థానిజ ప్రజాప్రతినిధులు, అధికారులు చూసి చూడనట్లు వ్యవహారించడం బాధాకరమన్నారు. ఇప్పటికైనా బస్తి వాసుల సమస్యను గుర్తించి భూగర్భ నీటిని తోడేస్తూ అక్రమ వ్యాపారం చేస్తున్న వాటర్ ప్లాంట్లను తొలగించి సమస్యను పరిష్కరించాలంటూ తహశీల్దార్ కార్యాలయం సూపర్డెంట్ కు వినతి పత్రం అందజేశారు . కార్యక్రమంలో పాపిరెడ్డి నగర్ బస్తివాసులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## మానవ అక్రమ రవాణాను అరికట్టేందుకు చర్యలు

**- మహిళా పోలీస్ స్టేషన్ సీఐ వాసవి**



**ఇబ్రహీంపట్నం, మే 12 (వార్తా ప్రభ ప్రతినిధి):** మానవ అక్రమ రవాణాను అరికట్టేందుకు విద్యార్థినులు అవగాహన కలిగి ఉండాలని మహిళా పోలీస్ స్టేషన్ సీఐ కె.వాసవి అన్నారు. ఇబ్రహీంపట్నం స్వర్ణ కన్వెన్షన్ లో మంగళవారం రాత్రి మహిళల, బాలబాలికల భద్రత, రక్షణ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏ కారణాలతో మానవ అక్రమ రవాణా జరుగుతుందో సోదాహరణంగా వివరించారు. మహిళలు, యువతులు, బాలలు అక్రమ రవాణాను నిరోధించేందుకు చైతన్యవంతం కావాలని కోరారు. అలాగే లైంగిక దాడులకు లింగ భేదం లేదన్నారు. తల్లిదండ్రులు పిల్లలను ఒంటరిగా వదిలి వెళ్లకూడదన్నారు. ఇలా వదిలితే అఘాయిత్యాలు జరిగే అవకాశం ఉందని హెచ్చరించారు. ఎన్ని చట్టాలున్నా మహిళలకు ఆత్మ విశ్వాసమే కొండంత బలం అన్నారు. 18 ఏళ్ల లోపు విద్యార్థినులు పోక్సో చట్టంపై అవగాహన కలిగి ఉండాలన్నారు. అత్యవసర పరిస్థితుల్లో విద్యార్థినులు శక్తి యాప్ ను ఉపయోగించుకోవాలని, 112, మహిళల సహాయార్థం 181, పిల్లల రక్షణ కోసం 1098 హెల్ప్ లైన్ నంబర్లను వినియోగించుకోవాలని సూచించారు. యువత సోషల్ మీడియా, మొబైల్ ఫోన్ల వినియోగంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. ఇబ్రహీంపట్నం సీఐ ఎ.సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ఉద్యోగాల కోసం ఆన్ లైన్ లో సెర్చ్ చేసి మోసపోవద్దని సూచించారు. ఈజీ మనీకి అలవాటు పడకుండా కష్టపడి సంపాదించడం అలవాటు చేసుకోవాలన్నారు. ఇన్ స్టాగ్రామ్, వాట్సాప్ లో అసభ్యకర మెసేజ్ లు, ఫోటోలు, వీడియోలు పంపినా, ఫేక్ అకౌంట్ లు క్రియేట్ చేసినా వెంటనే వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలన్నారు. ఉమెన్స్ హాస్టళ్లకు ఉమెన్ వార్డెన్లు మాత్రమే ఉండాలని, సీసీ కెమెరాలు సక్రమంగా పనిచేసేలా చూడాలన్నారు. విద్యార్థినులు తల్లిదండ్రుల నమ్మకాన్ని నిలబెట్టాలని, మహిళా సాధికారతతోనే అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. ఎస్సై సత్యవతి మాట్లాడుతూ లోన్ యాప్స్ ను ఉపయోగించి ప్రమాదంలో పడొద్దన్నారు. కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం ఎస్సై రవివర్మ, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# జర్నలిస్ట్ లపై దాడుల నిరోధక కమిటీని తక్షణమే ఏర్పాటు చేయండి

**రాష్ట్రవ్యాప్తంగా ఉత్తమ జర్నలిస్టులకు అవార్డు ఇవ్వండి**

**- సమాచార శాఖ డైరెక్టర్ కు ఏపీజేఎఫ్ అధ్యక్షులు రాజేష్ వినతి**



**విజయవాడ, మే 12 :(వార్తా ప్రభ ప్రతినిధి)** జర్నలిస్టులపై జరుగుతున్న దాడులను అరికట్టేందుకు రాష్ట్రవ్యాప్తంగా దాడుల నిరోధక కమిటీ ఏర్పాటు చేయాలని సమాచార శాఖ రాష్ట్ర డైరెక్టర్ విశ్వనాథన్ ను మంగళవారం నాడు ఆంధ్ర ప్రదేశ్ జర్నలిస్ట్ ఫోరమ్ (ఏపీజేఎఫ్) రాష్ట్ర అధ్యక్షులు శివ రాజేష్ కోరారు. కర్నూలు జిల్లా మీడియా అక్రిడేషన్ కమిటీ మెంబర్ హరినాథ రెడ్డి, ఏపీజేఎఫ్ జిల్లా అధ్యక్షులు రామకృష్ణ, నాయకులు శ్రీనివాసులు, రఘురాం, భూపాల్ లతో కలసి జర్నలిస్టుల సమస్యలపై డైరెక్టర్ తో రాజేష్ చర్చించడం జరిగింది. త్వరలో రాష్ట్ర వ్యాప్తంగా ఉత్తమ జర్నలిస్టులను ఎంపిక చేసి అవార్డుల ప్రదానం చేసే కార్యక్రమాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. సమాచార శాఖ డైరెక్టర్ విశ్వనాథం స్పందిస్తూ. జర్నలిస్టులపై జరిగే దాడులను నివారించేందుకు రాష్ట్ర వ్యాప్తంగా నివారించేందుకు కమిటీ ఏర్పాటు చేస్తామని సానుకూలంగా త్వరలో కమిటీ వేసేందుకు జీ ఓను విడుదల చేసి జిల్లాల వారీగా కమిటీలు ఏర్పాటు చేస్తామన్నారు. జర్నలిస్టుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని డైరెక్టర్ ఏపీజిఎఫ్ నాయకులతో పేర్కొన్నారు.

# అంబరాన్ని తాకిన హనుమాన్ శోభాయాత్ర



**పెడన మే 12 :(వార్తా ప్రభ ప్రతినిధి)**కృష్ణాజిల్లా పెడన పట్టణం రామలక్ష్మి వీవర్స్ కాలనీలో వేంచేసియున్న శ్రీ అభయాంజనేయస్వామి దేవాలయం కమిటి సభ్యులు ఆధ్వర్యంలో శ్రీ జాన నాగేశ్వరరావు సత్యవతి దంపతులచే మంగళవారం ఉదయం లక్ష్మీగణపతి హోమం జరిగింది. సింధూర తమలపాకుల పూజలు విశేషంగా అందుకున్న వానర శ్రేష్టులు అతి బలవంతుడు భజరంగీ శ్రీ రామభక్తుడు హనుమ జయంతిలి సందర్భంగా వారి రామ భక్తిని చాటి చెప్పేందుకు శోభాయాత్రను ప్రత్యేక ఆహ్వానితులు స్థానిక నివాసితులు ప్రముఖ వ్యాపార వేత్త అలుగూరు ఆంజనేయులు ప్రముఖ సంఘ సేవకులు మేమున్నాం సేవా సంస్థ ఫౌండర్ అండ్ చైర్మన్ శ్రీనివాస్ వీణం ఆలయ కమిటీ అధ్యక్షులు పేరక రాంబాబు కార్యవర్గ సభ్యులు జెండా ఊపి యాత్రను ప్రారంభించగా లిరాష్ట్రీయ స్వయం సేవక్ నక్కిన సోమేశ్వరరావు కార్యక్రమాన్ని ముందు నుండి పర్యవేక్షణ చేయగా కృష్ణా జిల్లా విశ్వహిందూ పరిషత్ జిల్లా కార్యదర్శి రాజశేఖర్ కోశాధికారి శ్రీకాంత్ గారు మరియు సహకార్యదర్శి పిచ్చుక శంకర్ కృష్ణా జిల్లా భజరంగ్ దళ్ అధ్యక్షులు శ్రీరామ్ శర్మ మహంకాళి ప్రముఖులు ప్రసంగిస్తూ హిందూ సమాజం ఐక్యతతో,ధర్మ పరిరక్షణ కోసం ముందుకు సాగాలని పిలుపునిచ్చారు హిందూ సంప్రదాయం మరియు పరిరక్షణలో భాగంగా హనుమాన్ శోభాయాత్ర అశేష భక్తజన సందోహంతో పెడన పట్టణ ప్రజలు ఐక్యతతో పట్టణ పురవీధులలోఅంబరాన్నంటే ఊరేగింపుతో యువత నృత్య ప్రదర్శన కోలాహల సంబరాల తో ఎండను సైతం లెక్కచేయకుండా జై శ్రీరామ్ అను నినాదాలతో హోరెత్తించి ఘనంగా ఇంతటి వైభవంగా జరిగిన కార్యక్రమంలో పట్టణ పుర ప్రజలు ఎంతో ఆసక్తిగా తిలకిస్తు భక్తులు సందడిగా దారి పొడవునా మజ్జిగ పంపిణీ సేవ చేయగా అనంతరం ఆలయం వద్ద సకుటుంబ సపరివార సమేతంగా ప్రత్యేక పూజలు మరియు అభిషేకాలు నిర్వహించి తీర్థ ప్రసాదాన్ని, అన్నప్రసాదం వితరణ స్వీకరించి స్వామి వారి ఆశీస్సులు పొంది ఆశీర్వాదం తీసుకున్నారు వివిధ ప్రాంతాల నుండి అశేష భక్తజనం వివిధ హిందూ సంఘాల నాయకులు పాల్గొనగా పోలీస్ శాఖ బందరు రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ నాగేంద్ర ప్రసాద్ వారి ఆధ్వర్యంలో పెడన సబ్ ఇన్స్పెక్టర్ బషీరా బంటుమిల్లి సబ్ ఇన్స్పెక్టర్ గణేష్ కుమార్ సిబ్బంది అధికారులు యాత్రలో బందోబస్తుగా ట్రాఫిక్ సమస్య మరియు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు ఏర్పడకుండా చక్కటి చర్యలు చేపట్టగా, పురపాలక శాఖ సహకారంతో శానిటేషన్ పనులను చేపట్టారు ఇతర శాఖలు వారు సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేసారు.

# వేర్వేరు ప్రమాదాల్లో వృద్ధుడు మృతి

**-నలుగురికి తీవ్ర గాయాలు**



**సంగం, మే 12 (వార్తాప్రభ ప్రతినిధి) :** సంగం మండలంలో మంగళవారం జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఓ వృద్ధుడు మృతి చెందగా, మరో నలుగురు గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. లింగసముద్రం మండలానికి చెందిన వట్టిగుంట రమణయ్య(70) చేజర్ల మండలం అదురుపల్లి చవటపల్లిలో నివసిస్తున్న తన కుమార్తె ఇంటికి మామిడిపళ్లు తీసుకుని ద్విచక్ర వాహనంపై బయలుదేరాడు. కొరిమెర్ల వద్దకు రాగానే నెల్లూరు నుంచి కలిగిరి మండలంలో జరిగే హనుమాన్ జయంతి కార్యక్రమానికి యూనికాన్ బైక్‌పై వెళ్తున్న యువకుల వాహనం ఎదురెదురుగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రమణయ్యతో పాటు ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను 108 వాహనంలో ఆత్మకూరు ప్రభుత్వాసుపత్రికి తరలించగా, రమణయ్య పరిస్థితి విషమించడంతో నెల్లూరుకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం సాయంత్రం



మృతి చెందారు. అదే రోజు సంగం హరిజనవాడకు చెందిన వెంకటనారాయణ బైక్‌పై బుచ్చి నుంచి సంగం వెళ్తుండగా లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అతడి కుడికాలు నుజ్జునుజ్జు అయింది. స్థానికులు 108 వాహనంలో వైద్యశాలకు తరలించారు. ప్రమాదాలకు గురైన ద్విచక్ర వాహనాలు, లారీని పోలీసులు అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. బుధవారం పోస్టుమార్టం అనంతరం రమణయ్య మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించనున్నట్లు ఎస్సై రాజేష్ తెలిపారు.


## హనుమజ్జయంతిలో గ్రామగ్రామాన అన్నదాన కార్యక్రమాలు



**హనుమాన్ జంక్షన్ : మే 12 :(వార్తా ప్రభ ప్రతినిధి)**హనుమాన్ జంక్షన్ లో 25 వ హనుమజ్జయంతి ఉత్సవాలు ఘనంగా జరిగాయి. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. అలాగే శ్రీ లక్ష్మి వెంకటేశ్వర స్వామి దేవస్థానం వద్ద హనుమజ్జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముగింపు కార్యక్రమంలో భాగంగా జై హనుమాన్ భజన మండలి ఆధ్వర్యంలో మహిళలు వేసిన కోలాట నృత్యాలు అలరించాయి. రైల్వే స్టేషన్ వద్ద శ్రీ సీతారామ దాసాంజనేయ స్వామి దేవస్థానంలో పల్నాటి సత్యన్నారాయణ, చోడే వెంకయ్య కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో 76 వ హనుమజ్జయంతి ఉత్సవాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. సుందరకాండ పారాయణంలో భక్తులు అత్యధిక సంఖ్యలో పాల్గొన్నారు. పెరికీడు వంతెన వద్ద ఆంజనేయ స్వామి ఆలయం వద్ద తవ్వా పూర్ణచంద్రరావు ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమం జరిగింది. వేలేరు అడ్డరోడ్ దేవాలయాల వద్ద కనుమూరి సూర్యనారాయణ రాజు కుటుంబ సభ్యులు, లారీ ఓనర్స్ వర్కర్స్ ఆధ్వర్యంలో గత 43 సంవత్సరాలుగా అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఈ రోజు సుమారు 20 వేల మంది భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.



## భక్తులకు చల్లటి మజ్జిగ పంపిణీ చేసిన దాతలు




**హనుమాన్ జంక్షన్, మే 12(వార్తాప్రభ)**హనుమజ్జయంతిని పురస్కరించుకుని హనుమాన్ జంక్షన్ శ్రీ అభయ ఆంజనేయ స్వామి ఆలయం వద్ద జరుగుతున్న 25 వ హనుమజ్జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని మంగళవారం హనుమాన్ జంక్షన్ లో హోటల్ సాయినాథ్ అధినేత, జనసేన నాయకులు అల్లాడిశెట్టి నాగేశ్వరరావు ఏర్పాటు చేసిన మజ్జిగ పంపిణీ కేంద్రాన్ని గన్నవరం నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయ కర్త చలమలశెట్టి రమేష్ బాబు ప్రారంభించారు. మజ్జిగతో పాటు భక్తులకు చక్రపొంగలి, పులిహోర ప్రసాదం అందజేశారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు అల్లాడిశెట్టి నాగేశ్వరరావు,వడ్డి శివ నాగేశ్వరరావు,షేక్ అహమ్మద్,పరుచూరి సుజిని, కోలసాని శివ లీల, బండారు ప్రసన్న లక్ష్మి, సజ్జత,భావజ్ఞ,కటకం నాగేశ్వరరావు, పుషదపు వీర వెంకయ్య,నోచర్ల సోమేశ్వరరావు,నోచర్ల అంజనీ కుమార్ తదితరులు పాల్గొన్నారు. కాగా హనుమాన్ జంక్షన్ విజయవాడ రోడ్ లో పలువురు దాతలు మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు,కృష్ణా జిల్లా కేంద్ర సహకార బ్యాంకు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మంచినీటి చలివేంద్రాన్ని కే డి సి సి బ్యాంకు జనరల్ మేనేజర్ బి ఎల్ చంద్రశేఖర్, ఏ జి ఎం ఎం శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో చీఫ్ మేనేజర్ యు, అవినాష్ , గన్నవరం నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయ కర్త చలమలశెట్టి రమేష్ బాబు,మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు దయాల రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ ఆంజనేయ స్వామి ఆశీస్సులతో అందరి జీవితాలలో ఆనందం, ఆరోగ్యం కలగాలి

**భక్తి, బలం, ధైర్యానికి ప్రతీక ఆంజనేయస్వామి**





**ఇబ్రహీంపట్నం, మే 12(వార్తా ప్రభ ప్రతినిధి):**వాయుపుత్ర శ్రీ హనుమాన్ జయంతి సందర్భంగా కొండపల్లి ఖిల్లా రోడ్డు ఆంజనేయస్వామి దేవాలయం వద్ద జయంతి వేడుకలను వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు జంపాల సీతారామయ్య,జనసేన పార్టీ మైలవరం నియోజకవర్గ ఇన్చార్జ్ అక్కల రామ్మోహన్రావు (గాంధీ), మున్సిపల్ చైర్మన్ చెన్నుబోయిన చిట్టిబాబు పాల్గొన్నారు. నిర్వాహకులు అతిథులకు ఘనంగా స్వాగతం పలికారు. దేవాలయంలో ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భం భక్తి, బలం, ధైర్యం కీ ప్రత్యేక అయిన శ్రీ ఆంజనేయ స్వామి మహాత్మ్యం తో అందరూ సంతోషంగా, ఆరోగ్యంగా ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆంజనేయ భక్తులకు అన్నప్రసాదాలు వడ్డించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ మున్సిపాలిటీ అధ్యక్షులు చెరుకుమల్లి సురేష్, స్థానిక కూటమి నాయకులు పాల్గొన్నారు.

## రెడ్డిగూడెం లో మనఊరు-మనబడి



**రెడ్డిగూడెం మే 12(వార్తాప్రభ ప్రతినిధి ):.** మన ఊరు – మనబడి,బడి పిలుస్తుంది ఎన్రోల్మెంట్ డ్రైవ్ కార్యక్రమంలో భాగంగా మండల విద్యాశాఖ అధికారి పజ్జూరి రమేష్ బాబు జడ్పిటిసి రెడ్డిగూడెం ప్రధానోపాధ్యాయిని ధర్మశీల మరియు సిబ్బంది, మరియు రెడ్డిగూడెం మెయిన్ పాఠశాల సిబ్బందితో కలిసి బడి పిలుస్తుంది కార్యక్రమంలో పాల్గొన్నారు . ఈ కార్యక్రమంలో ఎంఈఓ పిల్లల తల్లిదండ్రులతో ముఖాముఖిగా మాట్లాడుతు ప్రభుత్వ పాఠశాలల యొక్క ప్రాముఖ్యతను ప్రభుత్వ ఉపాధ్యాయుల బోధన విధానాలను వివరించి అడ్మిషన్లు తీసుకున్నారు .

## అగ్ని ప్రమాద నిరోధక అవగాహన కార్యక్రమం నిర్వహించిన విఎంసి ఫైర్ ఆఫీసర్స్




**విజయవాడ పశ్చిమ మే 12 :(వార్తా ప్రభ ప్రతినిధి)**విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశాల మేరకు అగ్ని ప్రమాదాలను నిరోధించడానికి మంగళవారం ఉదయం విజేత స్కూల్, రామలింగేశ్వర నగర్ ప్రాంతంలలో ఆకస్మిక తనిఖీ చేసారు. వి యం సి సిబ్బంది. ఈ కార్యక్రమంలో అగ్ని ప్రమాదం జరగకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన నిరోధక చర్యలు, అగ్ని ప్రమాద నిరోధక పరికరాలను ఉపయోగించు విధానము, అగ్ని ప్రమాదం జరిగినప్పుడు మంటలను ఎలా అర్పాలి, ఎటువంటి పరికరాలను ఉపయోగించాలి, ఫైర్ స్ప్రింక్లర్స్, స్మోక్ డిటెక్టర్స్, ఎక్కడెక్కడ అమర్చాలి, వాటి వలన స్మోక్ అలారం ఎలా వస్తుంది, అగ్ని ప్రమాదం జరగకుండా కాంప్లెక్స్ చుట్టూ ఫైర్ సేఫ్టీ మెజర్స్ ఏమేం ఉండాలి వంటి విషయాలపై వారికి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో రీజినల్ ఫైర్ ఆఫీసర్ మల్యాద్రి, స్టేషన్ ఫైర్ ఆఫీసర్ నరేష్, సిబ్బంది పాల్గొన్నారు.

## సంగం జాతీయ రహదారిపై చికెన్ వ్యర్థాల అక్రమ రవాణా

**-రెండు వాహనాలు సీజ్.. కేసు నమోదు**



**సంగం, మే 12 (వార్తాప్రభ ప్రతినిధి) :** సంగం జాతీయ రహదారిపై అక్రమంగా తరలిస్తున్న రెండు చికెన్ వ్యర్థాల వాహనాలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు పోలీసులు తనిఖీలు నిర్వహించగా, అనుమతులు లేకుండా చికెన్ వ్యర్థాలను తరలిస్తున్నట్లు గుర్తించారు. దీంతో వెంటనే రెండు వాహనాలను సీజ్ చేసి కేసు నమోదు చేశారు. ఘటనపై పూర్తి స్థాయిలో విచారణ కొనసాగిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఫోటో : పోలీసుల అదుపులో వాహనాలు

